# ధరణితో లక్షల ఎకరాలు నిషేధిత జాబితాలోకి..

**రైతు సంక్షేమమే ధ్యేయంగా "భూభారతి" ఏర్పాటు**

**భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం**

**రైతు అవగాహన సదస్సులో ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి**




మాట్లాడుతున్న ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, దేవరకద్ర,ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని దేవరకద్ర శాసన సభ్యులు జి.మధుసూధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం దేవరకద్ర మండలం శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు బిడ్డ ఎ.రేవంత్ రెడ్డి సిఎంగా ప్రభుత్వం రైతుల శ్రేయస్సు కోసం తీసుకువచ్చిన భూ భారతి చట్టం రైతుల చట్టం అన్నారు. ఈ చట్టంపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. గ్రామాల్లో చర్చించాలని రైతులు, మహిళా సంఘాలను కోరారు. ధరణి అనే మహమ్మారిని కె.సి.ఆర్ నెత్తిన రుద్దారని, ధరణిలో లక్షల భూములు నిషేధిత జాబితా లోకి వెళ్లినట్లు తెలిపారు. కబ్జాలో ఉన్న భూమి రికార్డు లో ఎక్క లేదని అన్నారు. ధరణి చట్టం గత ప్రభుత్వం లో నాయకులకు మాత్రమే ఉపయోగపడినట్లు,సామాన్య ప్రజలకు ఉపయోగ పడ లేదని అన్నారు ధరణి చట్టం ద్వారా అధికారులతో కుమ్మక్కు అయి గత ప్రభుత్వంలో కొందరు -మిగతా3లో..

# మహబూబ్‌నగర్‌ను అద్భుతంగా చేస్తున్నాం..

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ ను అన్ని విధాలా అద్భుతంగా అభివృద్ధి చేస్తున్నామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్ నగర్ నగర పాలక పరిధి లోని వార్డు నెంబర్లు 35,36 , 45,46,48 49 వార్డుల్లో మొత్తం ఆరు వార్డులలో 2 కోట్ల 80 లక్షల రూపాయలతో నిర్మించనున్న సిసి రోడ్ల నిర్మాణపు పనుల కోసం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల కాలంలో 200 కోట్ల రూపాయలతో మహబూబ్ నగర్ పట్టణంలో సిసి రోడ్లు, డ్రైన్లు కోసం ఖర్చు చేశామని ఆయన తెలిపారు. రానున్న రోజుల్లో ఇంకా వందల కోట్ల రూపాయలు ప్రభుత్వం నుంచి తెచ్చి మహబూబ్ నగర్‌ను అభివృద్ధి చేస్తాం అని ఆయన స్పష్టం చేశారు. అర్బన్ ఛాలెంజ్ మిషన్ కింది రూ.400 కోట్ల పనులకు ప్రణాళికలు సిద్ధం -మిగతా3లో..

## చివరి దశకు చేరుకున్న సహాయక చర్యలు



సహాయక చర్యలు కొనసాగుతున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** నాగర్‌కర్నూల్ జిల్లాలోని శ్రీశైలం ఎడమ గట్టు ఎస్ఎల్‌బిసి సొరంగంలో కొనసాగుతున్న సహాయక చర్యలు చివరి దశకు చేరుకున్నాయి. సొరంగంలో చిక్కుకున్న ఆరుగురి కోసం 62 రోజులుగా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. మట్టి, బురద తొలగింపు దాదాపు పూర్తి అయినప్పటికీ డేంజర్ జోన్ సమీపంలో మాత్రం సహాయక చర్యలు ప్రారంభించలేదు. ప్రభుత్వం ఈ విషయంపై ఈరోజు ఏదో ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఆ తర్వాత సహాయక చర్యలు కొనసాగే అవకాశం ఉంది.

మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

# మళ్లీ వలస పోతున్నారు

- రాష్ట్రం అధోగతి పాలు
- పాలకులపైకి తిరగబడే రోజులు వస్తాయి
- గతంలో అభివృద్ధిలో పోటీ పడ్డాం..
- చలో వరంగల్‌సభను దిగ్విజయం చేయాలి
- మీడియా సమావేశంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్
- చలో వరంగల్ సభకు సన్నాహక సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి




సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్

**మహబూబ్‌నగర్ బ్యూరో,ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** వలసలకు కేరాఫ్‌గా ఉన్న పాలమూరును అభివృద్ధిలో పోటీపడి ముందు వరుసలో నిలిపితే 16 నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్ళీ వలసలు పోయే దుస్థితి ఏర్పడిందని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. అధికార కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తుందని మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, డాక్టర్ సి.లక్ష్మారెడ్డి, దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులు, కార్యకర్తల అనంతరం వారు మీడియా సమావేశంలో మాట్లాడారు. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల కాలంలోనే ప్రజలకు అర్థమయిపోయిందని ఆయన చెప్పారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మంత్రులు, ఎమ్మెల్యేలం అందరము పోటీలు పడి అభివృద్ధి చేసామని తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లా పరిస్థితి 2014కు ముందు, తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి ఎలా ఉందో ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ఉమ్మడి పాలమూరు జిల్లా తాగునీటి గోస తీర్చేందుకు కేసీఆర్ హయాంలో చేపట్టిన పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా కాల్వల ఏర్పాటు కోసం వేసిన టెండర్లను ఈ ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఇప్పటి వరకు ప్రాజెక్టు పూర్తి కోసం చర్యలు తీసుకోకపోవడం ఈ పాలకుల పనితీరుకు నిదర్శనం అన్నారు. ప్రతి పనికి పర్సెంటేజీలు అడుగుతున్నారని స్వయంగా ఆ పార్టీ నాయకులే చెబుతున్నారని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలు విసుగుచెంది శ్రీలంకలో పాలకుల పై తిరగబడినట్లు ఈ రాష్ట్రంలోనూ తిరగబడే రోజులు వస్తున్నాయన్నారు. ఈ నెల 27న వరంగల్ లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను జయప్రదం చేసేందుకు కార్యకర్తలు, నాయకులు స్వచ్ఛందంగా తరలి రావాలి అని విజ్ఞప్తి చేశారు.

### ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కేసీఆరే సీఎం: మాజీ మంత్రి లక్ష్మారెడ్డి



రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయం అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పాలమూరు జిల్లా అధ్యక్షుడు డా. లక్ష్మా రెడ్డి అన్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకుల మాయ మాటలు నమ్మి మోసపోయామని ప్రజలు వాపోతున్నట్లు ఆయన తెలిపారు. ఎన్నికలు ఎప్పు డు వస్తాయా..!? ఎప్పుడు కేసీఆర్‌ను సీఎంగా చేసుకొని అభివృద్ధి చేసుకుందామా అని కసిగా ఎదురు చూస్తున్నట్లు లక్ష్మారెడ్డి తెలిపారు. వరంగ ల్ సభకు ఊహించిన జనం కన్నా ఎక్కువగా.. స్వచ్ఛందంగా రావడానికి సన్నద్ధం అవుతున్నారని చెప్పారు. చరిత్రలో గొప్ప సభగా నిలిచే ఈ సభను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. - మిగతా3లో..

# రాజీవ్ యువవికాసం ఎంపిక పారదర్శకంగా జరగాలి

**అధికారులకు కలెక్టర్ సంతోష్ ఆదేశాలు**



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్

**గద్వాల ప్రతినిధి, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాజీవ్ యువ వికాసం పథకంలో ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా, త్వరితగతిన నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడిఓసి కాన్ఫరెన్స్ హాల్‌లో రాజీవ్ యువ వికాసం పథకంపై ప్రత్యేక డిసిసి బ్యాంకుల సమావేశం,ఇందిరమ్మ ఇండ్లు, ఎల్.ఆర్.ఎస్‌పై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా జిల్లాకలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభంచడం జరిగందని తెలిపారు.ఈపథకానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.6,000కోట్ల నిధులు కేటాయించిందని తెలిపారు. జిల్లా స్థాయిలో ఇప్పటి వరకు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల నుండి 25,500 దరఖాస్తులు అందాయని, వాటిలో 8000 దరఖాస్తులను సెక్టర్ల వారీగా పారద ర్శకంగా స్క్రూటీని చేయాలన్నారు.ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా ఉండేలా అధికారులు ఆధార్,ఆదాయం,కులధృవీకరణపత్రాలతో పాటు అర్హత ప్రమాణాలను క్షుణ్ణంగా పాటించాలని సూచించారు. దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసి, కార్పొరేషన్ వారీగా,బ్యాంకులు శాఖలవారీగా వర్గీకరించి సోమవారంలోగా సంబంధిత బ్యాంకు మేనేజర్లకు సమర్పించాలని ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లకు కలెక్టర్ ఆదేశించారు. బ్యాంకు మేనేజర్లకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వారంలోగా అర్హత నివేది కను అందజేయాలని ఆదేశించినారు. జిల్లా స్థాయిలో దరఖాస్తుల పరిశీలన 28మేవరకు నిర్వహించాలన్నారు. మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటుచేశామని, ఈకమిటీలు ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా పరిశీలించి అర్హత ఉన్నవారిని మాత్రమే ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేస్తూ, నిర్దేశించిన లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.ఇందిరమ్మ ఇండ్ల పనుల లక్ష్యాలను పూర్తిచేయాలని జిల్లాకలెక్టర్ బి.యం సంతోష్ అధికారులను ఆదేశించారు.ఇందిరమ్మఇండ్ల నిర్మాణంలో పురోగతిపై మండలాల వారీగా సమీక్షించిన కలెక్టర్,ప్రతి మండలంలో గ్రౌండింగ్, బేస్‌మెంట్, మార్క్ అవుట్,రీ వెరిఫికేషన్,పూర్తి వివరాలు అధికారుల నుంచి అడిగి తెలు సుకున్నారు.మంజూరైన ఇండ్లలో 10 శాతం ఇండ్లకు బేస్‌మెంట్ పను లు ఒకవారం లోపే పూర్తయ్యేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలం మొదలయ్యేలోగా మంజూరు ప్రక్రియ పూర్తి చేసి,నిర్మాణ పనులు వేగంగా ప్రారం భించి పూర్తి చేయాలని సూచిం చారు. ఇందిరమ్మ కమిటీల ద్వారా అర్హుల జాబితా తీసుకుని,అర్హతను పరిశీలించి, నిర్మాణానికి అర్హులైన లబ్ధిదారులను గుర్తించి,ఇండ్ల నిర్మాణాన్ని పంచాయతీ కార్యదర్శితో సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.నిర్మాణ దశలను బట్టి దశల వారీగా లబ్ధిదారులకు ప్రతి సోమవారం నాడు వారి ఖాతాలోనే నేరుగా డబ్బులను జమ చేయడం జరుగుతుందన్నారు.ఏప్రిల్ 30 లోపు ఫీల్డ్ వెరిఫికేషన్‌ను పూర్తిచేసి,అర్హులైన వారినే తుది జాబితాలో ఎంపిక చేయాలని ఆదేశించారు.నిరుపేద అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు అందించాలని అధికారులను ఆదేశించారు ఎల్.ఆర్.ఎస్ కొరకు వచ్చిన పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు, ఈ.డి ఎస్సీ కార్పొరేషన్ రమేష్ బాబు,ఇంచార్జ ఎల్డీయం శ్రీనివాస రావు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, వివిధ శాఖల బ్యాంకు మేనేజర్లు, తదితరులు పాల్గొన్నారు .

# ప్రతి ఒక్కరూ భూభారతిలో పాల్గొనాలి..

**పకడ్బందీగా ఏర్పాట్ల ను చేపట్టాలి : జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి**



ఏర్పాట్లను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

**చిన్నచింతకుంట,ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూభారతి పథకాన్ని ప్రతి రైతుకు అవగాహన కల్పించేందుకు జిల్లాలోని ఆయా మండలాలలో భూభారతి అవగాహన సదస్సుల పేరిట ప్రభుత్వం కార్యక్రమాలను నిర్వహిస్తుంది. దీనిలో భాగంగా చిన్నచింతకుంట మండల కేంద్రంలో స్థానిక ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే భూభారతి అవగాహన సదస్సు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి జిల్లా ఉన్నత అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు.సీ.సీ కుంట, కౌకుంట్ల మండల రైతులకు ఒకే చోట భూభారతి అవగాహన సదస్సును నిర్వహిస్తున్నామని ఈ రెండు మండలాల నుంచి తరలివచ్చే రైతులు, ప్రజలకు సరిపడ ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని మండల స్థాయి అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భూభారతి పథకాన్ని తీసుకొచ్చిందని, ఈ పథకంపై ప్రతి రైతుకు అవగాహన కల్పించేందుకు సదస్సులను నిర్వహిస్తున్నామన్నారు.ఈ అవగాహన సదస్సులో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉన్నత అధికారులతో పాటు తహసిల్దారు ఎల్లన్న,ఎంపీడీవో సుధాకర్ రెడ్డి,డిప్యూటీ తహసిల్దార్ చంద్రశేఖర్, ఎస్సై రామ్‌లాల్ నాయక్, ఇతర శాఖ అధికారులు పాల్గొన్నారు.















## సైబర్ నేరాల పట్ల జాగ్రత వహించాలి



సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎస్ఐలు

**కల్వకుర్తి, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** మీకు లాటరీ తగిలిందని, మీ కుటుంబ సభ్యులకు మెడికల్ ఇబ్బందులు ఉన్నాయని, ఆధార్ కార్డు పాన్ కార్డు బ్యాంక్ అకౌంట్ మొబైల్ నెంబర్ తదితర విషయాలను అడిగి సైబర్ మోసాలకు పాల్పడుతున్నారని, అలాంటి వారి పట్ల జాగ్రత్తగా వ్యవహరించాలని కల్వకుర్తి సీఐ నాగార్జున, ఎస్సై మాధవరెడ్డిలు సూచించారు. శుక్రవారం వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో డ్రైవర్లకు, మహిళలకు, ఇతరులకు సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఎలా ఉండాలో వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంధువులు కానీ అపరిచిత వ్యక్తులు కానీ అధిక వడ్డీలు ఇస్తామని ఆశ పెడితే డబ్బులు ఇచ్చి నష్టపోవద్దన్నారు. ప్రస్తుత సీజన్‌లో నడుస్తున్న ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, లోన్స్ తీసుకొని ఇబ్బందులకు గురి కావద్దని, మీ మీ ఇళ్లల్లో ఉన్న యువకులు విద్యార్థులు ఆన్లైన్ గేమ్స్ పట్ల ఆకర్షితులు కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో పోలీసులు, డ్రైవర్లు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి:ఎస్ఐ కురుమూర్తి



వేసవి శిక్షణ శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

**వెల్దండ, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని, నచ్చిన రంగాన్ని ఎంచుకొని అందులో శిక్షణ పొందినట్లయితే విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని ఎస్ఐ కురుమూర్తి అన్నారు. వెల్దండ మండల కేంద్రంలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో వందేమాతరం ఫౌండేషన్ శృతిలయ కల్చరల్ అకాడమీ వేసవి శిక్షణ శిబిరం పోస్టర్‌ను ఎస్సై కురుమూర్తి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి శిక్ష శిబిరాన్ని మండలంలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జోనల్ ఇంచార్జ్ శ్రీరామ్, మండల ఇన్‌చార్జి మల్లేష్, బ్రాంచ్ ఇన్‌చార్జిలు రవళి, శ్రీకళ కోఆర్డినేటర్ పావని, ప్రేమలత, మహేశ్వరిలు ఉన్నారు.

## ఆవోప వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం




మాట్లాడుతున్న ఎంఈఓ మంజుల దేవి

**జడ్చర్ల,ఏప్రిల్25 ప్రభాతవార్త:** జడ్చర్ల ఆవోపా ఆధ్వర్యంలో వచ్చే విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదవబోయే విద్యార్థులకు ఆర్యవైశ్య ప్రొఫెషనల్ అండ్ అఫీషియల్స్ అసోసియేషన్ వారిచే శుక్రవారం ఉదయం మెమోరియల్ పాఠశాలలో 200 మంది తెలుగు ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు హాజరయ్యారు. ఈ శిక్షణ శిబిరానికి హాజరవుతున్న 10వతరగతి విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసే ఉద్దేశంతో విద్యార్థులకు ఉచిత శిక్షణ అందిస్తున్న ఆవోప సభ్యులకు స్థానిక ఉదయం మెమోరియల్ ప్రిన్సిపాల్ వీణశివకుమార్ అభినందనలు తెలియజేశారు. ఈ సమావేశంలో జడ్చర్ల తిమ్మాజిపేట మండల విద్యాధికారులు పాల్గొన్నారు. తిమ్మాజిపేట మండల విద్యాధికారి సత్యనారాయణ శెట్టి నిర్వహణలో పేద విద్యార్థులకు ఎన్నో విద్యాసంబంధ కార్యక్రమాలు గత 20 సంవత్సరాలుగా చేపడుతున్నామని తెలియజేశారు. జడ్చర్ల మండల విద్యాధికారిని మంజులాదేవి మాట్లాడుతూ ఈవేసవి శిక్షణ శిబిరంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ సెలవుల్లో పేద విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వడం అభినందనీయమని ఈ కార్యక్రమాన్ని చేపట్టిన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మురళీకృష్ణ శివకుమార్ వారి కార్యవర్గ సభ్యులను అభినందించారు. అవోపా అధ్యక్షుడు మురళీకృష్ణ ఈ వేసవి శిక్షణ శిబిరాన్ని అందరు సద్విని యోగం చేసుకోవాలని క్రమశిక్షణతో ఉండి చదువుకోవాలని ఇక్కడ ఉచితంగా ప్రతిరోజు చదువుతో పాటు అల్పాహారం అని వసతులు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోధిస్తున్న ఉపాధ్యాయులను సమావేశానికి హాజరైన తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో ఆవోప రాష్ట్ర బాధ్యులు గుండ్ల శ్రీనివాసులు, తిరుపతయ్య, సతీష్‌కుమార్ ,వజ్ర లింగం, శ్రీధర్ రామకృ ష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణానికి విరాళం

**ఆత్మకూర్,ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** ఆత్మ కూరు మండలంలోని పిన్నంచర్ల గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్నటువంటి అభయాంజ నేయ స్వామి దేవాలయ పునర్నిర్మాణానికి ఆ త్మకూర్ మాజీ ఎంపీపీ బంగారు శ్రీనివాసు లు మూడు లక్షల రూపాయల విరాళాన్ని శుక్రవారం ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖ ర్ రెడ్డికి అందజేశారు. గ్రామంలో గత కొన్ని రోజులుగా అభయాంజనేయ స్వామి దేవాల యం కోసం విరాళాలు సేకరిస్తున్న నేపథ్యం లో ఆత్మకూర్ స్థిర వ్యాపారి మాజీ ఎంపీపీ బంగారు శ్రీనివాసులు పిన్నంచర్ల గ్రామంలోని అభయాంజనేయ స్వామి దేవాలయపున నిర్మాణానికి మూడు లక్షల రూపాయలు విరాళం అందచేయడం పట్ల పిన్నంచర్ల గ్రామస్తులు ఆలయ కమిటీ సభ్యులు పలువురు ప్రత్యేకంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో నిర్మిస్తున్నటువంటి అభయాంజనేయ స్వామి దేవాలయానికి ప్రతి ఒక్కరూ ధన రూపేనా గాని వస్తురూపేనా గాని సహాయ సహకారాలు అందించి ఆలయ నిర్మాణానికి పూర్తిస్థాయిలో సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు బంగారు భాస్కర్ మాజీ సర్పంచ్ వెంకటేష్, అశోక్, గోపాల్ యాదవ్, మనోహర్‌గౌడ్, నర్సింహా శెట్టి, వెంకటేష్ శెట్టి తదితరులతో పాటుగా పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## కేటీఆర్‌ను కలిసిన నాయకులు



కేటీఆర్‌తో ఉప్పల వెంకటేష్, పలువురు నాయకులు

**కల్వకుర్తి, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** హైదరాబాద్ నందినినగర్‌లో బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావును కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులతో తెలంగాణ రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ గురించి ఉప్పల వెంకటేష్‌తో పాటు పలువురు నాయకులకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గం నుంచి రజతోత్సవ సభకు కార్యకర్తలను తరలించడానికి కావాల్సిన ఏర్పాట్లను చేసుకోవాలన్నారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు గోపాల్‌నాయక్, ఒరుగంటి వెంకట్ రెడ్డి, తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు దారమోని గణేష్, బుచ్చిబాబు, మాడ్గుల మండల యువకుడు తెల్గమల్ల వంశీలు ఉన్నారు.

## రాష్ట్ర నాయకుడి ముందే ఆత్మకూర్ బిజెపిలో భగ్గుమన్న విభేదాలు

**ఆత్మకూర్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మక్తల్ నియోజకవర్గ ఇన్చార్జ్ బంగ్లా లక్ష్మీకాంత్ రెడ్డి ముందే శుక్రవారం మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహంలో జరిగిన బిజెపి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆత్మకూర్ పట్టణ, రూరల్ నాయకుల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. ఆత్మకూరు మండల బిజెపి పార్టీ అధ్యక్షులుగా గత నాలుగు నెల క్రితం మండలంలోని పిన్నంచర్ల గ్రామానికి చెందిన అశోక్ భూపాల్ యాదవ్‌ను జిల్లా కమిటీ ప్రకటించడంతో ఒక్కసారిగా ఆత్మకూరు పట్టణంలోని ఇతర గ్రామాలు, మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూర్ పట్టణ నాయకుల మధ్య తీవ్రస్థాయిలో విభేదాలు చూపినట్లుగా తెలిసింది ప్రధానంగా శుక్రవారం రాష్ట్ర నాయకుడి ముందే రూరల్ పట్టణ కమిటీ నాయకులు ఒకరిపై ఒకరు తీవ్రస్థాయిలో ఆరోపణలు చేసుకోవడమే కాకుండా నువ్వేంత అంటే నువ్వెంత అన్నట్లుగా వాగ్ధానాలు చోటు చేసుకోవడంతో ఒకానొక సందర్భంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లక్ష్మీకాంత్ రెడ్డి సమావేశం నిర్వహించకుండానే వెళ్లిపోతానని స్పష్టం చేయడంతో శాంతించినట్లుగా తెలిసింది. ప్రధానంగా ఆత్మకూరు మండల బిజెపి అధ్యక్షులుగా ఆత్మకూరు పట్టణానికి చెందిన నాయకులను నియమించాలని పట్టణ నాయకులు పట్టు పట్టడంతో మరో వర్గం మాత్రం పట్టణానికి కాకుండా మండలంలోని ఏదైనా ఒక గ్రామానికి చెందిన పార్టీ కోసం పని చేసే వారిని అధ్యక్షులుగా కొనసాగించాలని పట్టుబట్టడంతో సమావేశం అర్ధాంతరంగా ముగించినట్లుగా తెలిసింది ఇదిలా ఉండగా నారాయణపేట బిజెపి జిల్లా అధ్యక్షులు సత్య యాదవ్ సైతం శుక్రవారం సమావేశంలో ఉన్న ఆత్మకూర్ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అశ్విని కుమార్ కు ఫోన్ చేసి పార్టీ ఆదేశానుసారం పనిచేయాలని స్పష్టం చేయడంతో కిందిస్థాయి కార్యకర్తలు లేకపోతే నాయకులు ఎలా కాగలుగుతామని ఎదురు ప్రశ్నించినట్లుగా తెలిసింది ఏది ఏమైనప్పటికీ ఆత్మకూరు మండల బిజెపి అధ్యక్షున్ని నియమించినప్పటికీ అలాకాకుండా పట్టణానికి చెందిన వారికి అధ్యక్షుని బాధ్యతలు అప్పగిస్తేనే తాము పని చేస్తామని స్పష్టం చేయడంతో ఎవరికివారుగా సమావేశం నుంచి అర్ధాంతరంగా వెళ్లిపోవడం విశేషం ఇదిలా ఉండగా త్వరలో జరగనున్న స్థానిక సంస్థలు ఎన్నికలకు సంబంధించి బిజెపి పార్టీని బలోపేతం చేయాలంటూ ఓవైపు రాష్ట్రస్థాయి నియోజకవర్గస్థాయి నాయకులు బహిరంగంగా ప్రకటిస్తున్నప్పటికీ ఆత్మకూరు మండలంలో కొనసాగుతున్న బిజెపి నేతల మధ్య విభేదాలు ఎటు దారితీస్తాయోనని పలువురు విశేషంగా చర్చించుకుంటున్నారు.

# నేరాల నిర్మూలన, శాంతి భద్రతల పరిరక్షణ తనిఖీలు : డిఎస్‌పి

**అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపైన చర్యలు తప్పవు**

**కాలనీలలో కొత్త వ్యక్తుల కదలికను పోలీసులకు సమాచారం ఇవ్వాలి**

**జిల్లా ఎస్పీ రావుల గిరిధర్**



ప్రజలకు నేరాల పట్ల అవగాహన కలిగిస్తున్న పోలీసులు

**వనపర్తి క్రైమ్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా ఎస్పీ రావులగిరిధర్ ఆదేశాలమేరకు వనపర్తి డిఎస్పీ,వెంకటేశ్వర రావు, వనపర్తి సీఐ,ఎం. క్రిష్ణయ్య ఆధ్వర్యంలో సీఐలు 01 ఎస్సైలు 11 మంది మొత్తం 70 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో కలిసి వనపర్తి పట్టణ పోలీస్టేషన్ పరిధిలోని పీర్లగుట్ట డబుల్ బెడ్ రూమ్స్ దగ్గర పోలీసులు ఆకస్మికంగా కమ్యూనిటీ కాంటాక్ట్ తనిఖీలు నిర్వహించి సుమారు 100 ఇళ్లను సోదాలు చేశారు. పత్రాలు సరిగా లేని నెంబర్ ప్లేట్ లేని ద్విచక్రవాహనాలు మొత్తం 24 వాహనాలు అదుపులోకి తీసుకొని సీజ్ చేసి వనపర్తి పట్టణ పోలీస్టేషన్‌కు తీసుకువెళ్లారు. సంబంధిత వాహనాల యజమానులు తమ వాహనాల పత్రాలను చూపించి వాహనాలను తీసుకువెళ్లాలని అన్నారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ. నేరాల నిర్మూలన కొరకే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించడం జరుగుతుందని, ప్రజల రక్షణ, ప్రజలకు భద్రత భావం, సెన్సాఫ్ సెక్యూరిటీ కల్పించడం గురించి, ఎవరైనా కొత్త వ్యక్తులు గాని నేరస్తులు గాని వచ్చి షెల్టర్ తీసుకుంటున్నారా అనే విషయం కూడా తెలుస్తుందని ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రభుత్వ పాలసీకి వ్యతిరేకంగా నిషేధిత గుట్కాల గుడుంబా తయారీ, గంజాయిని విక్రహిచడం, పీడీస్ రైస్ అక్రమ రవాణా, కలప అక్రమ రవాణా వంటి చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. గుడుంబా,గుట్కా,గంజాయి లాంటి అక్రమ వ్యాపారం, చట్ట వ్యతిరేకమైన కార్యాకలాపాలకు పాల్పడకూడదన్నారు. వాహనాలు నడిపే టప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలి అని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ అందరు కలిగి ఉండాలి అన్నారు. చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని సూచించారు. వాహనాల సంబందించిన ధ్రువపత్రాలు రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ కలిగి ఉండాలి అన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ఉండి ఏదైనా ప్రమాదం జరిగిన సమయంలో ఇన్సూరెన్స్ వర్తించదు ఇన్సూరెన్స్ గడువు ముగిషాక ముందే దానిని రెనివల్ చేపించుకోవాలని సూచించారు. మహిళల భద్రతే పోలీసుల లక్ష్యం అన్నారు. మహిళలు, యువతులు, చిన్నపిల్లలతో మర్యాదగా ప్రవర్తించి వారిని గౌరవించాలి. మన కుటుంబ సభ్యులతో ఎంత మర్యాదగా ఉంటామో బయట వారితో కూడా అలాగే మెదలాలని సూచించారు. మహిళ పట్ల, చిన్న పిల్లలపట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన, వారిని మానసిక, శారీరకంగా హింసించిన వారిపట్ల చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటాం కేసులు నమోదు చేయడం జరుగుతుంది అని తెలిపారు. ప్రజలు, మహిళలు ఆపద సమయంలో, ఎవరైనా చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడిన, యువకులు గుంపులు గా ఏర్పడి బహిరంగ మద్యపానం సేవించిన, ప్రజా శాంతికి భంగం కలిగించే విధంగా ప్రవర్తించిన వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100 కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు. సమాచారం ఇచ్చే అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయి అన్నారు. ప్రజల రక్షణ, ప్రజలకు పోలీసులు ఎప్పుడూ అందుబాటులో ఉంటారు అనే భరోసా నమ్మకం కలిగించే కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగానే కమ్యూనిటీ కాంటాక్ట్ పోలీసింగ్ ప్రోగ్రాం కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని దీనికి ప్రజలు సహకరించాలని కోరారు. కాలనలలో మరింత స్వీయ రక్షణ కొరకు సీసీ. కెమెరాలను అమర్చుకోవాలని ఈ విషయంలో పోలీసుల సహకారం ఉంటుందని, భద్రతా పరమైన అంశాలలో సీసీ కెమెరాలు కీలక పాత్ర వహిస్తాయని తెలిపారు. మీ కాలనీలో ఎవరైనా కొత్తవారు అనుమానాస్పదంగా తిరుగుతూ ఉంటే వెంటనే డయల్ 100 కు గాని సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసిన వెంటనే చర్యలు చేపడతామన్నారు. తనిఖీలు నిర్వహించడం వలన నేరాల రేటు తగ్గుతాయని ప్రజలకు మరింత రక్షణ కల్పించవచ్చని తెలిపారు. సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలని మనకు తెలిసినటువంటి నెంబర్ నుంచి వచ్చిన మెసేజ్లను లింకును ఓపెన్ చేయొద్దని, అత్యాశకు పోయి లాటరీ వచ్చిందని, లోన్ వచ్చిందని వచ్చిన, ఏదైనా గిఫ్ట్ లు వచ్చాయని ఫోన్ కాల్స్ వచ్చిన మెసేజ్ లు వచ్చినా వెంటనే వాటికి సమాధానమిస్తూ ఓటిపిలను పిన్ నెంబర్లను చెప్పకూడదు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన ట్లయితే వెంటనే 1930 లేదా డయాల్ 100 కి కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా అదనపు ఎస్పీ, రాందాస్ తేజావత్, వనపర్తి డిఎస్పీ, వెంకటేశ్వర్ రావు, వనపర్తి సిఐ, ఎం,కృష్ణయ్య, వనపర్తి పట్టణ ఎస్సై, హరిప్రసాద్ వనపర్తి రూరల్ ఎస్సై, జలేందర్ రెడ్డి, అన్ని పోలీస్టేషన్ల ఎస్సైలు, ఏఎస్సైలు, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్స్, మహిళ కానిస్టేబుళ్లు. హోంగార్డ్స్, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సివి రామన్ విద్యార్థుల విజయ దుందుబి..!

**ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలలో మెరిసిన విద్య కుసుమాలు**

**సివి రామన్ కళాశాల విద్యార్థులను ప్రశంసించిన, పలు రాజకీయ నాయకులు, వివిధ కుల సంఘ నాయకులు**




విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యజమాన్యం

**వనపర్తి క్రైమ్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో జిల్లా కేంద్రంలోని సివి రామన్ కళాశాల విద్యార్థులు విజయ దుందుభి మోగించారని కళాశాల కరస్పాండెంట్ వీరయ్య తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో 467 సానియా, 465 శ్రావణి, 464 తనుశ్రీ, 462 ఐశ్వర్యలు మార్కులు సాధించగా బైపిసి విభాగంలో 435 లక్ష్మినారాయణ, 431 మధుమోహన్ రెడ్డి, 428 సూర్య వర్షిని తరహా మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో 993 చరణ్ తేజ, 993 ఆర్సియా, 992 విశ్వతేజ, 991 సంధ్య, 990 అక్షిత మార్కులు సాధించగా, ద్వితీయ సంవత్సరం బైపిసిలో 988 అక్షయ, 984 మోనిక, శ్వేత 982 మార్కులతో అత్యుత్తమ ప్రతిభ కనపరిచారని ఆయన పేర్కొన్నారు. కళాశాలలో ఇన్నోవేటివ్ సైంటిఫిక్ టీచింగ్ అప్రోచ్ కార్యక్రమాల ద్వారా విద్యార్థులు మంచి మార్కులు సాధించారన్నారు. ఇంతటి ఘనవిజయం సాధించి నందుకు సహకరించిన విద్యార్థులకు అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమమైన ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల యజమాన్యం, వివిధ రాజకీయ నాయకులు, కుల సంఘం నాయకులు, పలువురు విద్యార్థులను శాలువాలతో సత్కరించి అనంతరం కళాశాల జాయింట్ సెక్రెటరీ వెంకటేశ్వర్లు, కోశాధికారి కుమారస్వామి, ప్రిన్సిపల్ ప్రకాష్, మల్లికార్జున్, పలువురు విద్యార్థులను అభినందించారు.

# కాంగ్రెస్ మాయమాటలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

**వంగూరు, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు అది చేస్తాం... ఇది చేస్తాం మండలాన్ని ఉద్ధరిస్తామని మాయమాటలు చెప్పి వినకపోతే జీవనోపాధి కోసం వ్యాపారం, వ్యవసాయం చేసుకుంటున్న వాళ్లను భయభ్రాంతులకు గురి చేసి అధికారం మాదుంది.. వస్తారా చస్తారని భయపెట్టి బిఆర్ఎస్ కుటుంబ సభ్యులను సైతం ఆందోళనకు గురి చేశారని అచ్చంపేట మాజీఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. శుక్రవారం వంగూరు మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొంతమంది మా పార్టీకి సంబంధించినటువంటి నాయకులను కాంగ్రెస్‌లో కలుపుకోవడం జరిగిందని వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉన్నటువంటి పుల్లయ్య యాదవ్, శ్రీశైలంతో పాటు కొంతమంది నాయకులను ఏ రోజు ఏమవుతుందో అధికారంలోకి వచ్చిన మూడు నెలల నుంచి మొదలైంది కాంగ్రెస్ పార్టీ నిజస్వరూపం ఏందో ప్రజలకు అర్థం అయ్యిందని ఇప్పటివరకు చూసుకుంటే ఎక్కడికక్కడ ప్రజల్లోపల వ్యతిరేకత మొదలైందని, అంతెందుకు కొండారెడ్డిపల్లి ముఖ్యమంత్రి గ్రామం ఆ గ్రామంలో మాత్రమే విద్యుత్‌కు సంబంధించి సోలార్ ఎనర్జీకి సంబంధించినటువంటి ప్యానల్ ఏర్పాటు చేసిన ఫోర్ లైన్ రోడ్ కూడా ఆ గ్రామానికి నిర్మించామని అధికారులకు ఆదేశాలు ఇచ్చినా నేటికీ పనులు పూర్తి కాలేదని అన్నారు. రైతులకు డిసెంబర్ 9న మొత్తం రుణమాఫీ చేస్తానని చెప్పి చేయకపోవడంతో నిరసన చేసిన రైతుల మీద దాడులకు దిగుతూ అక్రమ కేసులు పెట్టి మా మాటే వేదం.. మా మాటే శిలా శాసనం అన్నట్టుగా వ్యవహరిస్తూ అందరిని భయభ్రాంతులకు గురి చేసే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. ఈ నెల 27న నిర్వహించే రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు గణేష్ రావు, నరేందర్ రావు, నాయకులు శ్రీపతిరావు, ప్రవీణ్ రెడ్డి, మందా రాజేందర్ రెడ్డి, అంకు సురేందర్, డిండి బాలస్వామి గౌడ్, సత్యం, మురళి, సాయి, సుమన్, కమలాకర్, ఆంజనేయులు, లక్ష్మణ్, జయపాల్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం తడవనీయొద్దు.. కొనుగోలు కేంద్రాలు తనిఖీ చేసిన కలెక్టర్



తూకాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, దేవరకద్ర, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** దేవరకద్ర మండలంలో శుక్రవారం చౌదర్పల్లి గ్రామంలో ఐకెపి ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంను మండలం వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తనిఖీ చేశారు. చౌదర్ పల్లిలో ఐకెపి ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోళ్లు పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్లు మంద గతిన ఉండడం గమనించి కొనుగోలు కేంద్రాల్లో రైతుల నుండి ఇప్పటివరకు కొనుగోలు చేసిన ధాన్యం ఎప్పటికప్పుడు రైస్ మిల్లకు తరలించాలని ఆదేశించారు. ప్యాడి క్లీనర్ గురించి నిర్వాహకులను కలెక్టర్ ప్రశ్నించారు. ప్యాడి క్లీనర్ రిపేరింగ్ వచ్చింది తీసుకుని రావాలని చెప్పడంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ప్యాడి క్లీనర్ ఏర్పాటు చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని అన్నారు. ప్రభుత్వం సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అంద చేస్తున్నట్లు తెలిపారు. రైతునుండి ధాన్యం కొనుగోలు తర్వాత కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పూర్తి బాధ్యత వహించాలని, ట్యాగ్ చేసిన మిల్లుకు రవాణా చేయాలని సూచించారు. వర్షాల వలన ధాన్యం తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దేవరకద్ర మండల వ్యవసాయ మార్కెట్ యార్డులో పిఏసిఎస్ సెంటర్‌లో ధాన్యం నిల్వలు పరిశీలించారు. ఇప్పటివరకు ఎన్ని సంచులు రైస్ మిల్లుకి తరలించారు ఇప్పటివరకు 10వేల బ్యాగ్‌లు రైస్ మిల్‌కు వెళ్లిపోయాయని ఇంకా 10 వేల సంచుల ధాన్యం మార్కెట్ యార్డ్‌లో ఉందని తెలిపారు. గన్ని లను వెంటనే సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ పౌర సరఫరాల సంస్థ అధికారితో మాట్లాడి ఆదేశించారు. రైతుల సౌకర్యార్థం కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఖచ్చితంగా ప్యాడి క్లీనర్ లను ఉపయోగించి చెత్త, తాలు లేని ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకు వచ్చి ప్రభుత్వం మద్దతు ధర పొందాలని సూచించారు.

# రైతులను మోసం చేస్తే సహించేది లేదు: కేవీఎన్ రెడ్డి



వరి పంటను పరిశీలిస్తున్న కేవీఎన్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** రాష్ట్రంలో నకిలీ విత్తనాలు, నకిలీ పురుగు మందుల అమ్మకాలు విక్రయిస్తే సహించేది లేదని వ్యవసాయ కమిషన్ సభ్యులు కేవీఎన్ రెడ్డి అన్నారు. ఇప్పటికే నకిలీ విత్తనాల అమ్మకాల విషయంలో సర్కార్ సీరియస్‌గా ఉందని, నకిలీ పురుగు మందుల విషయంలో కూడా చర్యలు తప్పవన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని చందువట్ల గ్రామంలో కొండకింది శ్రీనివాస్ రెడ్డి అనే రైతు పండించిన వరి పంటకు పురుగు పట్టడంతో క్రిమి సంహారక మందులు చల్లాడు. అయితే అది చల్లిన తర్వాత వరి పంట పూర్తిగా మాడిపోయింది. దీంతో వ్యవసాయ కమిషన్‌కు రైతు ఫిర్యాదు చేయడంతో వ్యవసాయ కమిషన్ సభ్యులు కేవీఎన్ రెడ్డి శుక్రవారం వరి పంటను పరిశీలించారు. ఇప్పటికే జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, అగ్రికల్చర్ యూనివర్సిటీ అధికారులు మాడిపోయిన వరి పంటను పరిశీలించారు. నకిలీ పురుగుమందుల వాడకమే కారణమని నిర్ధారినంచారు. ఈ సందర్భంగా కేవీఎన్‌రెడ్డి మాట్లాడుతూ రైతులకు నకిలీ విత్తనాలు, నకిలీ మందులు విక్రయించే ఫర్టిలైజర్ షాపులపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలన్నారు. నాణ్యత లేని విత్తనాలు విక్రయిస్తే సదరు ఫర్టిలైజర్ షాపుల లైసెన్స్‌లు రద్దు చేయాలన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టాలన్నారు.

## పెండింగ్ కేసులు పరిష్కరించాలి

**స్పెషల్ లోక్ అదాలత్‌లో జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి**

**మహబూబ్‌నగర్‌బ్యూరో,ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ ఆదేశాల మేరకు చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి శుక్రవారం జిల్లా కోర్టులో స్పెషల్ లోక్ అదాలత్‌లో ఎన్ఐ ఆక్ట్ కేసుల గురించి బ్యాంక్ మనేజర్స్, ఫైనాన్స్ ఇన్స్టిట్యూషన్స్/ స్టేక్ హోల్డర్స్, స్టాండింగ్ కౌన్సిల్స్‌తో సమావేశంను నిర్వహించినారు. ఈ సమావేశంలో ఎన్ఐ యాక్ట్ సెటిల్మెంట్ గురించి మాట్లాడారు. బ్యాంక్ మేనేజర్లు, ఫైనాన్స్ ఇన్స్టిట్యూషన్స్/ స్టేక్ హోల్డర్స్‌తో స్పెషల్ లోక్ అదాలత్ లో అధిక మొత్తంలో కోర్టు పెండింగ్‌లో ఉన్న ఎన్ఐ యాక్ట్ పరిష్కారం అయ్యే విధంగా కృషి చేయాలని, ఎన్ఐయాక్ట్ కేసులలో ఉన్న కక్షిదారులకు అందరికీ నోటీసులు పంపించి వారి యొక్క కేసులలో తప్పకుండా హాజరు అయ్యే విధంగా కృషి చేయాలని తెలియజేశారు. కక్షిదారులను ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోమని తెలియజేశారు. ఈ మీటింగ్ లో,జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ జిల్లా కార్యాదర్శి డి. ఇందిరా, బ్యాంక్ మేనేజర్లు, ఫైనాన్స్ ఇనిస్టిట్యూషన్స్/స్టేక్ హోల్డర్స్ పాల్గొన్నారు.

## మునిరంగ నాటకానికి విరాళం

**వెల్దండ,ఏప్రిల్25 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని పోతేపల్లి శ్రీశ్రీ రేణుకఎల్లమ్మ కళాబృందం మునిరంగస్వామి బైలు నాటకానికి బిఆర్ఎస్ పార్టీ నాయకులు తగుళ్ల కొండల్‌యాదవ్ రూ.10,116లను శుక్రవారం నిర్వాహకులకు విరాళంగా అందించారు. ఈసందర్భంగా కొండల్‌యాదవ్ మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనంద రిపై ఉందన్నారు. కార్యక్రమంలో మార్కండేయుడు, సైదయ్య, గోపాలు, వెంకటయ్యతో పాటు కళాకారులు గ్రామస్తులు ఉన్నారు.

## నేడు భూభారతిపై అవగాహన సదస్సు

**కల్వకుర్తి,ఏప్రిల్25 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలోని పద్మశాలి కళ్యాణ మండపం, వాసవినగర్‌లో శనివారం భూ భారతి పోర్టల్‌పై అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు తహశీల్దార్ ఇబ్రాహీం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి అవగాహన సదస్సు కార్యక్రమంలో ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి, పార్లమెంట్ సభ్యులు మల్లురవి, జిల్లా కలక్టర్ బాదవత్ సంతోష్, అడిషనల్ కలక్టర్ దేవ సహాయంలు పాల్గొంటారని తహసీల్దార్ పేర్కొన్నారు. ఇట్టి భూ భారతి పోర్టల్ అవగాహన సదస్సుకు రైతులందరూ పెద్ద సంఖ్యలో హాజరై వారి సందేహాలు నివృత్తి చేసుకోవాలని తహశీల్దార్ ఇబ్రాహీం సూచించారు.

## అపరచిత వ్యక్తులను నమ్మొద్దు

**వెల్దండ,ఏప్రిల్25 ప్రభాతవార్త:** గుర్తుతెలియని అపరిచితులు చెప్పే మాయమాటలను ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో నమ్మవద్దని హెడ్ కానిస్టేబుల్ శ్యాంసుందర్ వెంకట్‌రెడ్డి అన్నారు. వెల్దండ మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అపరచిత వ్యక్తులు చెప్పే మాటలకు నమ్మి అత్యాశకు పోకూడదని, బ్యాంకు ఖాతా వివరాలతో పాటు ఆన్‌లైన్ మోసాలకు గురి కాకూడదని అన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది నవీన్, మహేష్, చంద్రశేఖర్, మల్లేష్, జ్యోతితో పాటు ఉన్నారు.

## పహల్గామ్ ఘటనపై బిజెపి మండల కార్యవర్గం సంతాపం

**మహ్మదాబాద్,ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** శుక్రవారం నాడు మండల కేంద్రంలో బీజేపీ మండల కార్యవర్గ సమావేశం ఏర్పాటు చే శారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా డా. "వెన్న ఈశ్వరప్ప హాజరు అయ్యారు. ఈ సందర్భంగా ముందుగా పహల్గాం ఉగ్ర వాదుల చేతుల్లో మృతి చెందిన హిందూ బంధువుల ఆత్మ శాంతి చేకూరాలని మౌనం పాటించారు. అలాగే వక్ఫ్ బోర్డ్ సవరణలో ఎలాంటి అన్యాయం జరగదు అన్నారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు విజయం సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పరిగి సీనియర్ నాయకులు రవిగౌడ్, జిల్లా నాయకులు కుర్వ కృష్ణ, ప్రధాన కార్యదర్శులు కాశినాథ్, జయ వర్ధన్ రెడ్డి, మాజీ ఎంపిటిసిలు, సువర్ణ, అడివప్ప, కావటి నర్సింలు, గోపాల్ ముదిరాజ్, గుల్ల శ్రీను, నరేష్, ఈశ్వర్, రమేష్, తిరుపతి, సురేష్, శ్రీను, రాజు, రమేష్, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

## వరి కొనుగోలు కేంద్రం ప్రారభం

**పెబ్బేరు, ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వరి కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం పెబ్బేరు మండల కొత్త సూగూర్ గ్రామంలో ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా నరసింహానాయుడు మాట్లాడుతూ రైతులకు ఎటువంటి నష్టం జరగకుండా పకడ్బందీగా వరి కొనుగోలు చేయాలని తెలియజేశారు. వరి కొనుగోలులో కేంద్రంలో ఎటువంటి మోసము జరగ కుండా చూడాలని రైతులకు గని బ్యాగ్స్ అందుబాటులో ఉన్నాయని రైతులకు తెలియజేయడం జరిగింది. ఎండాకాలంలో రైతులకు నీరు ఉండటానికి నీడ ఏర్పాటు చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెబ్బేర్ మార్కెట్ డైరెక్టర్ నరసింహనాయుడు, దర్గా పీఠాధిపతి సయ్యద్ మబ్బులు, కాంగ్రెస్ నాయకులు షణ్ముఖి, కుమ్మరి అద్వానీ, అగ్రికల్చర్ ఆఫీసర్ ఆంజనేయులు, అమాలి సంఘం అధ్యక్షుడు చంద్రయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ సభకు తరలిరండి : మాజీ ఎమ్మెల్యే



వరంగల్ సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

**మక్తల్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** ఈ నెల 27న వరంగల్‌లో జరిగే బిఆర్ఎస్ రజతోత్సవ సభకు మక్తల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మక్తల్ పట్టణంలో బహిరంగ సభ వాల్ పోస్టర్లను ఆవిష్కరించి, స్వయంగా గోడలపై అంటించారు. గత 16 నెలల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందని ఆయనఅన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఏమాత్రం పట్టించుకోకుండా రాక్షస పాలన సాగిస్తున్నదని ఆయన అన్నారు. కేసీఆర్ సారథ్యంలో మళ్ళీ రాష్ట్రంలో బిఆర్ఎస్ అధికారం చేపట్టడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి.నరసింహగౌడ్, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జుట్ల చిన్న హనుమంతు, మాజీ ఎంపిటిసి మారుతిగౌడ్, నాయకులు జుట్లశంకర్, గాల్‌రెడ్డి, బండారి ఆనంద్ పాల్గొన్నారు.

## క్రికెట్ పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**మక్తల్ టౌన్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** మక్తల్ నియోజకవర్గ కేంద్రం స్థానిక ప్రభుత్వ క్రీడా మైదానంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కోళ్ళ వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మక్తల్ సూపర్ ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ను స్థానిక శాసనసభ్యులు వాకిటి శ్రీహరి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్మారెడ్డి, చంద్రకాంత్ గౌడ్, కట్ట సురేష్, కావలి శ్రీహరి, లక్ష్మణ్ సింగ్, విఘ్నేష్, వాకిటి శ్యామ్, కల్లూరి హన్మంతు, బోయ వెంకటేష్, నాగరాజ్, రాజేందర్,శాలం, రహీం పటేల్, వాకిటి భాస్కర్, వర్కూరు అంజి, కావలి తాయప్పా, శంశోద్దీన్, కావలి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి ట్యాంకుల వద్ద బురదమయం



బురదమయంగా మారిన ప్రాంతాన్ని చూయిస్తున్న గ్రామస్తులు

**అమరచింత, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** తాగునీటి ట్యాంక్ వద్ద లీకేజీ నీరుతో బురదమయమైన సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని కొంకని వానిపల్లి గ్రామంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్య దర్శి ఎండి కుతుబ్ ఆరోపించారు. శుక్రవారం గ్రామంలోని ఎనిమిదో వార్డులో ఉన్న మంచినీటి ట్యాంకుల పరిసర ప్రాంతాలన్నీ బురదమయం అయ్యాయని దీనివల్ల కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు ఆరోపించారు. ట్యాంకు నుండి లీకేజీ అయిన నీరు ఈ వార్డులో బురదగా మారి రాత్రివేళ దుర్వాసనతో పాటు దోమల బెడదతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. గ్రామంలో ఇంత పెద్ద సమస్యను సంబంధిత పంచాయతీ కార్య దర్శికి, ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఈ పరిసర ప్రాంతాలను శుభ్రపరచి తాగునీటి లీకేజీని అరికట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఐ, ఏఐవైఎఫ్ ఎంపీడీవో కార్యాలయం ముందు ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాధవి, సత్యమ్మ, మన్నెమ్మ, చంద్రి, మంగమ్మ లక్ష్మమ్మ పాల్గొన్నారు.

## రేపు శ్రీరామ కొండకు ఎంపీ డీకే అరుణ రాక

**కోయిలకొండ ఏప్రిల్25 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కోయిలకొండలో వెలసిన మహిమాని త్వమైన శ్రీరామ కొండ దివ్య క్షేత్రానికి రేపు ఆదివారం అమావాస్య ను పురస్కరించుకొని శ్రీరాముని దర్శనానికి మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ వస్తున్నారని మండల బిజెపి అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, మండల బిజెపి పార్టీ సీనియర్ నాయకుడు ఎన్.రాములు గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరామకొండ దివ్య క్షేత్రం అభివృద్ధికి ఎంపీ డీకే అరుణ కృషి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల బిజెపి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## అంబులెన్స్‌లను జాగ్రత్తగా నడపాలి



108,102 వాహనాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్న రాష్ట్ర ఫ్లీట్ హెడ్ గిరీష్ బాబు

**గద్వాల ప్రతినిధి, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** గద్వాల జిల్లా 108,102,పార్థివ వాహనాలను తెలంగాణ రాష్ట్ర ఫ్లీట్ హెడ్ గిరీష్ బాబు శుక్రవారం ఆకస్మికంగా తనకి చేయడం జరిగింది. ఈ తనిఖీలు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ రవికుమార్, గద్వాల జిల్లా కోఆర్డినేటర్ రత్నమయ్యలు పాల్గొన్నారు. ఈ ఆకస్మిక తనిఖీలు గద్వాల్ హాస్పిటల్ 108 అంబులెన్స్ రికార్డులను అంబులెన్స్ పరికరాల పనితీరును సిబ్బంది యొక్క పనితీరును పరిశీలించడం జరిగి ంది. అదేవిధంగా 102 అమ్మ ఒడి వాహనాన్ని కూడా తనిఖీ చేయడం జరిగింది. గర్భిణీలకు సకాలంలో సేవలు అందించాలని సూచించారు. అదేవిధంగా వాహన నిర్వహనని కూడా సరిగ్గా చేసుకోవాలని వివరించారు. అంబులెన్స్‌లను జాగ్రత్తగా నడపాలని ఎల్లప్పుడూ ప్రజలకు అత్యుత్తమ సేవలను అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈఎంటీలు,పైలట్ లు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలి

**అమరచింత, ఏప్రిల్25 ప్రభాతవార్త:** ఇందిరమ్మ లబ్ధిదారుల ఎంపికను అధికారులు పారదర్శకంగా ఎంపిక చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు, జిఎస్. గోపి, సిపిఎం జిల్లా నాయకులు, బి.వెంకటేష్, ఎస్.రాజు, ఎస్.అజయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం అమరచింత మండల కేంద్రంలోని జిఎస్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ, అధికారులు హరులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేసిన ఇందిరమ్మ కమిటీలు సమావేశాలు జరగకుండా అధికారులు లబ్ధిదారులను ఎంపిక చేయడం అన్యాయమని వారన్నారు. గత బిఆర్ఎస్ పాలనలో పేదలకు ఇండ్లు మంజూరు లేక పేదలు చాలా ఇబ్బందులు పడ్డారని ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని ఆశపడ్డ వారికి నిరాశే మిగిలిందని వారు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గానికి 3500 ఇండ్లు మంజూరు చేస్తామని వాగ్దానం చేసిన గ్రామాలలో ఇండ్లు లేని పేదలకు ఇండ్లు మంజూరు కాలేదని ముఖ్యమంత్రి సొంత జిల్లా ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా కు నియోజకవర్గానికి 10,000 ఇండ్లు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. హరులైన ప్రతి ఒక్కరికి ఇండ్లు మంజూరు చేయాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

## ప్రతి ఇంటి ముందు ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలి



ఇటిక్యాలలో ఇంకుడు గుంతలను పరిశీలిస్తున్న జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ నర్సింగ్‌రావు

**ఇటిక్యాల, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాలలో ప్రతి ఇంటి ముందు ఇళ్ల యజమానులు ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు సూచించారు. శుక్రవారం ఉదయం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్మించిన ఇంకుడు గుంతలను తహసిల్దార్ వీరభద్రప్పతో కలిసి పరిశీలించారు. వీటిని నిర్మాణం వలన గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలంటే తప్పనిసరిగా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని ప్రజలను కోరారు. అంతేకాక ఇటిక్యాల అచ్చుమ్మ చెరువు నుండి ప్రతిదిన శివారు వరకు ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న ఫార్మేషన్ రోడ్డు నిర్మాణంలో ఇటిక్యాలకు చెందిన చెందిన రైతు ఇబ్బందులు చేస్తున్నారని నక్ష ప్రకారం పనులు జరుగుతున్నాయని పనులు ఇబ్బందులు జరగకుండా అందుబాటులో సంబంధిత రెవెన్యూ అధికారులను అందుబాటులో ఉంచాలని తాహసిల్దార్ వీరభద్రతో మాట్లాడారు. అలాగే ఐకెపి కార్యాలయాన్ని సందర్శించి ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు మహిళా సమాఖ్య ద్వారా ఏకరూప దుస్తులను కుట్టిస్తుండగా కొలతల ప్రకారం కుట్టాలని అలాగే గ్రామాల వారిగా రిజిస్టర్లు ఏర్పాటు చేసుకోవాలని ఏపీఎం కురుమన్నకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు మనోహర్, మదన్ మోహన్, ఏపిఎం కురుమన్న, సూపరింటెండెంట్ జయరామయ్య టైపిస్టు రాజవర్ధన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## దోమలను నివారిద్దాం.. మలేరియా వ్యాప్తిని అరికడదాం!

◆ జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా. శ్రీనివాసులు



**వనపర్తి క్రైమ్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** దోమల అప్పుడు తినే నివారించి మలేరియాను అరికట్టామని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా.శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం పురస్కరించుకొని జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డా. సాయినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా డా. శ్రీనివాసులు మాట్లాడుతూ మలేరియా వ్యాధి రావడానికి ముఖ్యమైన కారణాలు ఆడ అనఫినెస్ దోమ కాటు వల్ల ఈ మలేరియా సంభవిస్తుందని దోమల నిర్మూలనకు చర్యలు చేపడితే మలేరియా నిర్మూలన కట్టడి చేసిన వాళ్లమవుతామని ఆయన అన్నారు. మలేరియా కు ముందస్తు చికిత్స రాడికల్ చికిత్స ద్వారా మలేరియా మరణాలను తగ్గించవచ్చని, పరిసరాల పరిశుభ్రతకు నిల్వనీటి అపరిశుభ్రత లేకుండా చూసుకోవడం ప్రధానఅంశం అన్నారు. దోమల అభివృద్ధి చెందకుండా జాగ్రత్తలు తీసుకుంటే మలేరియా నిర్మూలన కోసం పనిచేసిన వారిమవుతామన్నారు. అలాగే మలేరియా నిర్మూలన కోసం పనిచేయాలని సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు. వారంలో ప్రతి శుక్రవారం డ్రైడే ప్రోగ్రామ్ నిర్విరామంగా పనిచేయాలన్నారు. దోమల అభివృద్ధిని నివారించడంతోపాటు మలేరియా వ్యాప్తిని అరికట్టవచ్చని హితువు పలికారు. ఈ కార్యక్రమంలో ఇమినేషన్ అధికారి పరిమళ, మారుతి నందన్ గౌడ్, క్షయ వ్యాధి అధికారి శ్రీనివాస్, జి. రవీంద్ర గౌడ్ పలువురు పాల్గొన్నారు.

## లబ్ధిదారుల పరిశీలన వేగవంతం



లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు

**నవాబుపేట, ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** మండల పరిధిలోని పలు గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల పరిశీలన వేగవంతం చేశారు. చౌదూరు బట్టోనీపల్లి మల్లారెడ్డిపల్లి చుట్టుపక్కల గ్రామాలలో మండల అధికారులు శుక్రవారం పరిశీలించి త్వరలోనే లబ్ధిదారులకు ఇల్లు నిర్మించే ప్రక్రియ మొదలుపెట్టాలని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. చౌదూర్ గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా మంజురైన లబ్ధిదారుల ఎంపిక ఎంపిడిఓ జయరామ్ నాయక్ ఆధ్వర్యంలో వెరిఫికేషన్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ఏపీవో జ్యోతి గ్రామ పంచాయతీ మాధవిలత, గ్రామ ప్రజాప్రతినిధులు వేణుగోపాల్ యాదవ్ కమిటీ మెంబర్స్ ఎండి షబీర్ అలీ,అమరేశ్వర్, సెల్ సత్యం,గ్రామ నాయకులు ప్రజలుతదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమానికి లబ్ధిదారులు అనిరుధ్ రెడ్డికి, మాజీ అధికార ప్రతినిధి దుశ్యంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

## సమ్మర్ క్యాంపు ప్రారంభం



సమ్మర్ క్యాంపును ప్రారంభిస్తున్న దృశ్యం

**మాగనూరు, ఏప్రిల్25 ప్రభాతవార్త:**మండల కేంద్రంలో వారియర్స్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఉచిత సమ్మర్ క్యాంపును ప్రారంభించడం జరిగింది. మాగనూరు మండలంలోని వివిధ గ్రామాల విద్యార్థులు పాల్గొంటున్నారు. ఇందులో 10 సంవత్సరాల నుండి 20 సంవత్సరాల వయసుగల యువతీ యువకులు దాదాపుగా 50 నుండి 60 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. ఈ క్యాంపు జూన్ 10వ తేదీ వరకు కొనసాగుతుంది సమయం ఉదయం 6:30 నుంచి 8:30 వరకు, సాయంత్రం నాలుగు గంటల నుంచి 5:30 వరకు ఉంటుంది తహసిల్దార్ కార్యాలయం పక్కన గ్రౌండ్లో క్యాంపు నిర్వహించబడుతుంది. వివిధ గ్రామాల యువతీ యువకులుఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాకేష్ పీడీ కోరారు. విద్యార్థులకు ఈ క్యాంపు ద్వారా కబడ్డీ వాలీబాల్ అథ్లెటిక్‌కి సంబంధించిన శిక్షణ ఇవ్వడం జరుగుతుంది క్యాంప్ ద్వారా విద్యార్థులు భవిష్యత్తులో వివిధ క్రీడా రంగాల్లో ముందుకు వెళ్లే విధంగా తీర్చిదిద్దుతామని అన్నారు. అదే విధంగా విద్యార్థులు ఆర్మీ పోలీస్ ఉద్యోగాలకు వెళ్లాలనుకున్న వారికి ఈ క్యాంపు ద్వారా శిక్షణ లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఆనంద్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఈ సమ్మర్ క్యాంప్‌లో పాల్గొని శారీరకంగా మానసికంగా దృఢంగా కావాలనిఈ సమ్మర్ క్యాంప్ లో పాల్గొన్నటువంటి విద్యార్థిని విద్యార్థులు అందరూ కూడా భవిష్యత్తులో తప్పకుండా వివిధ రంగాలలో రాణించాలని మాగనూరు మండలానికి మంచి పేరుతీసుకుని రావాలని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నటువంటి వారియర్స్ డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ ఆంజనేయులు ఆర్మీ, పిడి రాకేష్ శర్మను అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిఈటీ వెంకటేష్ అశోక్ గౌడ్,మాజీ ఎంపీపీ శ్యామల,చిన్నప్ప, పూలరాము, నర్సింలు, వెంకటేష్ గౌడ్, (జానీ) రాజు,సర్పంచ్ గ్రామపెద్దలు,యువకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## సన్మార్గంలో నడిచేందుకు.. ఆధ్యాత్మికంతో పాటు క్రీడలు అవసరం

◆ బిజ్వార్ అంబాత్రయ క్షేత్ర వ్యవస్థాపకులు ఆదిత్య పరాశ్రీ స్వామి



క్రీడలను ప్రారంభిస్తున్న ఆదిత్య పరా శ్రీ స్వామీజీ

**ఊట్కూరు, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** ఊట్కూరు మండల పరిధిలోని బిజ్వార్ గ్రామంలోని శుక్రవారం అంబాత్రయ క్షేత్రంలో అట్టహాసంగా 44వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ షూటింగ్ బాల్ పోటీలు ప్రారంభించారు. చిన్నతనం నుంచే సన్మార్గంలో నడిచేందుకు ఆధ్యాత్మికంతో పాటు ఆటలు ఎంతో అవసరమని బిజ్వార్ అంబాత్రయ క్షేత్ర వ్యవస్థాపకులు ఆదిత్య పరాశ్రీస్వామి అన్నారు. రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ షూటింగ్ బాల్ పోటీలు 25 నుంచి 27వ తేదీ వరకు మూడు రోజులపాటు జరిగే పోటీలకు గురించి స్వామీజీ మాట్లాడుతు ఆధ్యాత్మికంతోనే భక్తి సన్మార్గం ఏర్పడుతుందని అన్నారు.అలాగే క్రీడలు క్రమశిక్షణ అలవరుస్తాయని దాంతో వ్యసనాలకుదూరమై ఆరోగ్యంగా ఉంచుతాయి అన్నారు. ఆరోగ్యంఆధ్యాత్మికం తోడైతే సన్మార్గం ఏర్పడుతుందని అందరూ సన్మార్గంలో నడిచి దేశభక్తి ఆధ్యాత్మికతను పెంపొందించాలని ఉపదేశించారు. ఈ క్రీడల్లో రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల నుండి 600 మంది బాలబాలికలు షూటింగ్ బాల్ పోటీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ సెక్రటరీ సిహెచ్ ఐలయ్య, టోర్నమెంట్ ఆర్గనైజర్ రమేష్,రిటైర్డ్ పిఈటిగోపాలం, పిడిలు,పిటిలు విష్ణు వర్ధన్‌రెడ్డి, ఆంజనేయులు, మంజునాథ్, శ్రీనివాస్, పవన్ సాయి రాఘవేందర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదాన్ని అణిచివేతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి

అమరచింత జామియా మసీద్ కమిటీ అధ్యక్షులు అయూబ్ ఖాన్



జామియా మసీద్ ఎదుట నిరసన తెలుపుతున్న ముస్లిం సోదరులు

**అమరచింత, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** జమ్మూ కాశ్మీర్‌లోని పహాల్గాం ప్రాంతంలో పర్యటకులపై దాడిచేసిన ఉగ్రవాదుల అణచివేతకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని అమరచింత జామియా మసీద్ కమిటీ అధ్యక్షులు, అయూబ్ ఖాన్ డిమాండ్ చేశారు. శుక్రవారం అమరచింత మున్సిపల్ కేంద్రంలోని జామియా మసీద్ కమిటీ ఆధ్వర్యంలో జమ్మూ కాశ్మీర్లో ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ ముస్లింలు జమీయ మసీదులో నల్ల బ్యాడ్జీలు ధరించి నమాజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,జమ్మూ కాశ్మీర్‌లోని పహాల్గం ప్రాంతంలో పర్యటకులపై ఉగ్రవాదులు దాడిచేసి 27 మందిని చంపడం బాధాకరమని ఆయన అన్నారు. ఉగ్రవాదులు అమాయక ప్రజలను చంపడం పిరికిపంద చర్యని ఇలాంటి సంఘటనలు జరగకుండా కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆర్మీలో రిక్రూట్మెంట్ నిర్వహించి ఉగ్రవాదులను ఎదుర్కోవాలని ఆయన అన్నారు. అలాగే ఉగ్రవాదుల దాడిలో మరణించిన కుటుంబాలకు కేంద్రప్రభుత్వం ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలోముస్లింసోదరులుభారీగా పాల్గొన్నారు.

## యువ వికాసంపై బ్యాంక్ అధికారులతో సమావేశం



**చిన్నచింతకుంట, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు రాజీవ్ యువ వికాసం పథకం ప్రవేశపెట్టింది. బ్యాంకుల ద్వారా అందించే రుణాలకు నిరుద్యోగ యువత ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారు. దీనికి సంబంధించి శుక్రవారం మండల పరిషత్ లోని ఎంపీడీవో ఛాంబర్‌లో యూనియన్ బ్యాంక్ సిసి కుంట, సెంట్రల్ బ్యాంక్ ఉంద్యాలకు చెందిన బ్యాంక్ అధికారులతో ఎంపీడీవో సుధాకర్ రెడ్డి సమావేశమయ్యారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నిరుద్యోగ యువతకు బ్యాంకు రుణాలు అందించాలని బ్యాంక్ అధికారులను ఎంపీడీవో సూచించారు. మండలంలో 1973 ఆన్ లైన్‌లో నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకున్నారు. మండల పరిషత్‌లో 1712 దరఖాస్తులను నిరుద్యోగ యువత అందజేశారు. వీటిలో ఎస్సీ కార్పొరేషన్‌కు443, ఎస్టీకార్పొరేషన్‌కు 88,బిసి కార్పొరేషన్‌కు 924, ముస్లిం మైనార్టీ కార్పొరేషన్ కు 196,క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్‌కు 33 దరఖాస్తులు చేసుకున్నారని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీఓ అనిల్ కుమార్, ఏపిఎం విష్ణు చారి, సూపరింటెండెంట్ విజయభాస్కర్ పాల్గొన్నారు.

## అంబలి కేంద్రం ప్రారంభం

**ధన్వాడ,ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** ధన్వాడ మండలంలోని చర్లపల్లి గ్రామ పంచాయతీలో శ్రీ ఆది ఆంజనేయ స్వామి దేవాలయం దగ్గర గ్రామ సెక్రెటరీ గ్రామ పెద్దల సమక్షంలో ఉపాధి హామీ కూలీలకు అంబలి కార్యక్రమం లింగల్ చేడ్ మొగులయ్య అంబలి కార్యక్రమం పెట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ కృష్ణయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ ఆంజనేయులు, గ్రామ పెద్దలు పై హనుమంతు, బసవరాజ్ గౌడ్, పి.ఆంజనేయులు, పి.శేఖర్, జె. వెంకటరాములు, ఎర్ర ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ధరణితో లక్షల ఎకరాలు నిషేధిత జాబితాలోకి..

మొదటి పేజీ తరువాయి భాగం..

భూములు కబ్జా చేశారని తెలిపారు. వాటి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. రైతులకు మేలు చేసే విదంగా క్షేత్ర స్థాయిలో అందరి అభిప్రాయాలను తీసుకుని వివిధ రాష్ట్రాల్లో చట్టం అధ్యయనం చేసి పకడ్బందీగా భూభారతి చట్టాన్ని రూపొందించినట్లు తెలిపారు. ప్రజా ప్రభుత్వానికి ప్రజల ప్రయోజనాలు ముఖ్యమని ఆయన అన్నారు. ధరణిలో ఉన్న లోపాలను గుర్తించిన రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే ధరణిని బంగాళాఖాతంలో కలిపేస్తానని హామీ ఇచ్చి, అన్న మాటకు కట్టుబడి మాటను నిలబెట్టుకుని ఇప్పుడు రైతుల మేలు కోసం భూ భారతిని తెచ్చారని తెలిపారు. రైతు బిడ్డకు మాత్రమే రైతుల కష్టాలు తెలుస్తుందని ఆయనఅన్నారు. భూ భారతిఅమలుతో రైతులతో పాటుగా భూమి ఉన్న వారందరికీ మేలు జరుగుతుందని, భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆయన తెలిపారు. దేవరకద్ర మండలంలో2లక్షలలోపు రుణం తీసుకున్న రైతులకు రూ.31కోట్ల రుణమాఫీ చేసినట్లు తెలిపారు. రైతు భీమా కింద చనిపోయిన 15రోజుల్లోనే 50మందికిరూ.2కోట్ల 50లక్షలుసహాయం అందించినట్లు తెలిపారు. రైతు భరోసా కింద 4 ఎకరాల లోపు ఉన్న వారికి రూ.10కోట్ల 75లక్షలు రైతుల అకౌంట్లో జమ చేశామన్నారు. సన్న వడ్లు విక్రయించిన రైతులకు వానా కాలం సీజన్‌లో బోనస్‌గా రూ.3 కోట్ల 77లక్షలు రైతులకు అంద చేసినట్లు తెలిపారు. యాసంగి సీజన్‌లో కూడా సన్న వడ్లకు బోనస్ చెల్లిస్తామని అన్నారు. ఎన్నికలలో ఇచ్చినహామీలు నెరవేర్చేందుకు ప్రభుత్వం, సిఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు నిరంతరం శ్రమి స్తున్నట్లు తెలిపారు. జవాబు దారీగా రైతులకు సంక్షేమం కోసం ఈ చట్టాన్ని అమలులోకి తీసుకు వచ్చినట్లు తెలిపారు. పేదలకు సన్న బియ్యం అంది స్తున్నట్లు తెలిపారు. రూ. 7 లక్షల కోట్ల అప్పులకు అసలు వడ్డీలు కడుతూ ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలు అమలుచేస్తుందని అన్నారు. జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తులలో 80 శాతం భూ సంబంధిత సమస్యలు వస్తున్నట్లు తెలిపారు. భూమి రికార్డులలో నమోదు కాకపోవడం,ప్రభుత్వఅవసరాల కోసం సేకరణలో నిషేధిత జాబితాలోకి వెళ్ళడం వంటిసమస్యలు పరిష్కారం కోసం వస్తున్నారని తెలిపారు. సంవత్సరాల తరబడి పెండింగ్ లో ఉన్న భూ సమస్యలు భూ భారతితో పరిష్కారమవుతాయని అన్నారు, ప్రజలు ఎలాంటి భూ సమస్యలున్నప్పటికీ కోర్టులను ఆశ్రయించకుండా ఆధికారుల స్థాయి లోనే సమస్యలు పరిష్కరించే వెసులుబాటును భూభారతి చట్టం తీసుకువచ్చిందని అన్నారు. భూ సమస్యలసత్వర పరిష్కారానికిఈ చట్టం ఎంతగానో దోదపడుతుందని ఆయన అన్నారు. రిజిస్ట్రేషన్, సాదా బైనమా, సీలింగ్, అసైన్మెంట్,వారసత్వ భూముల పరిష్కారంతోపాటు మార్పులు చేసుకునే అవకాశం భూ భారతి లో ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. రైతులకు ఉచిత న్యాయ సహాయం అందించాలని చట్టం లో పేర్కొన్నట్లు తెలిపారు. జూన్ లో నిర్వహించే రెవెన్యూ సదస్సుల్లో గ్రామ గ్రామానికి రెవెన్యూఅధికారులు వచ్చి దరఖాస్తులు తీసుకుని సమస్యలు పరిష్కరిస్తారని తెలిపారు. రిజిస్ట్రేషన్ మ్యుటేషన్ చేసేప్పుడు ప్రతి మార్పు సర్వే చేసి మ్యాపు రూపొందించి పాస్ పుస్తకంలో పొందు పరచి ప్రింట్ చేసి జారీ చేయనున్నట్లు తెలిపారు. ప్రతి భూమికి భూదార్‌నంబర్ ఇవ్వడం జరుగుతుందని, భూ వివాధాలకు చెక్ పడుతుందని అన్నారు. గ్రామంలో రెవెన్యూ వ్యవస్థ బలోపేతం చేసేందుకు ప్రతి గ్రామం లో గ్రామ పరిపాలన అధికారిని నియమించడం జరుగుతుందని తెలిపారు. భూమి సర్వేకోసం లైసెన్సుడ్ సర్వేలనుకూడా నియమించినట్లు తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు,అర్‌డిఓ నవీన్, నియోజక వర్గ ప్రత్యేక అధికారి, జిల్లా సహకార అధికారి శంకరాచారి, తహశీల్దార్ కృష్ణయ్య, ఎంపిడిఓ శ్రీనివాస రావు పాల్గొన్నారు.

## మళ్లీ వలస పోతున్నరు

మొదటి పేజీ తరువాయి భాగం..

మళ్లీ సీఎం కేసీఆర్ కావాలి : మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డితెలంగాణ రాష్ట్రం గోస పూర్తిగా తీరాలి అంటే మళ్లీ కేసీఆర్ సీఎం కావాల్సిందే అని ప్రజలు గట్టిగా చెబుతున్నారని దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా మిషన్ భగీరథ వంటి పథకాలను ప్రవేశపెట్టి అమలు చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కింది అన్నారు. ఏ రాష్ట్రంలో చూసిన హ్యాండ్ బోర్లు.. ఇతర ఇతర మార్గాలద్వారా తాగునీటిని తెచ్చుకోవాల్సి నపరిస్థితులు ఉన్నాయన్నారు. గతంలో జరిగిన ఎన్నికల ఓటమికి కృంగి పోవాల్సిన అవసరం లేదు. మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయం అని చెప్పారు. వరంగల్ సభకు బయలుదేరి సభను విజయవంతం చేసి.. మన నేత కేసీఆర్ చెప్పే మాటలను విని అందుకుఅనుగుణంగానియోజకవర్గాలలోకార్యాచరణను రూపొందించుకొని జనాలకు మరింత చేరువ అవుదామని చెప్పారు. వరంగల్ సభ ఒక అపురూపమైన సభ, ఈ సభను దిగ్విజయవంతం చేయవలసిన బాధ్యత మనందరిపై ఉంది అన్నారు.

**సీఎంతో జిల్లాకు ఒరిగిందేమీ లేదు : ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెడ్డిల పరువు తీస్తున్నాడని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మాయలో పడి ఈ జిల్లా వాసిని సీఎం చేస్తే ఒరిగింది ఏమీ లేదు అని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఈ ప్రభుత్వం పై ఆగ్రహంగా ఉన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప మరి ఏమీ లేదు అన్నారు.

**పహల్గావ్ ఘటన మృతులకు నివాళులు:** జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గావ్‌లో ముష్కరుల దాడుల ఘటనలలో మృతులకు నివాళులు అర్పించారు. ఇటువంటి ఘటనను పార్టీలు కులాలు మతాలకు అతీతంగా ఖండించాలిఅని మాజీ మంత్రులులక్ష్మారెడ్డి, శ్రీనివాస్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ నర్సింలు, ముడా మాజీ చైర్మన్ గంజివెంకన్న, నాయకులు శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మహబూబ్‌నగర్‌ను అద్భుతంగా చేస్తున్నాం..

మొదటి పేజీ తరువాయి భాగం..

చేసి పంపించడం జరిగింది ఆయన తెలిపారు. అలాగే అమృత్ పథకం ద్వారా రూ.260కోట్ల పనులు ప్రారంభించడం జరిగిందని ఆయన తెలిపారు. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, డిస్ట్రిక్ట్ నాలెడ్జ్ హబ్ ను 27 కోట్ల తో మొదలు పెట్టుకోబోతున్నామని ఆయన చెప్పారు. మహబూబ్ నగర్ కార్పొరేషన్ ను అన్ని విధాలా అభివృద్ధిచేయుటకు నిరంతరం శ్రమిస్తున్నామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు ఎన్ పి వెంకటేష్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ సాయిబాబా, సిజె బెనహర్, మున్సిపాలిటీ కమీషనర్‌మహేష్,ఎం.ఈ. సందీప్ మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు, చిన్న ఖాజాపాషా, షౌకత్ అలీ, ఉమర్, లక్ష్మణ్ నాయక్, అంజాద్, రాషెద్‌ఖాన్, హన్మంతు, నాయకులు ఫక్రూ ,ముకుందం రమేష్,అర్షద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## అమరులకు అశ్రు నివాళి

**బాలానగర్, ఏప్రిల్25 ప్రభాతవార్త:** జమ్ముకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా పహల్గాంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన బైసరన్‌లో ఉగ్రవాదులు నరమేదానికి పాల్పడి 26 మంది పర్యాటకులను హతమార్చిన సంగతి పాఠకులకువిధితమే. ఈ ఉగ్రదాడిని నిరసిస్తూ శుక్రవారం బాలానగర్ మండల కేంద్రంలో కొవ్వొత్తులు వెలిగించి నిరసన చేపట్టారు. అమరులైన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఉగ్రవాదం నశించాలి అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో కులమతాలకు అతీతంగా బాలానగర్ కు చెందిన యువకులు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినిలను సన్మానించిన ఎస్పీ

◆ విద్యతోనే విజయం సాధించాలి : వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్



అత్యుత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న జిల్లా ఎస్పీ

**వనపర్తి క్రైమ్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లాలో పోక్సో అత్యాచార బాధితులకు వైద్య, న్యాయ, సైకాలజికల్ సపోర్ట్ వంటి సేవలు ఒకే గొడుగు కిందకి తీసుకువచ్చి పోలీసు శాఖలోని ఉమెన్ సేఫ్టీవింగ్ తమ వంతు సేవలు అందిస్తోంది. ఈ భరోసా కేంద్రము బాధితులు ఆర్థికంగా ఎదిగేలా స్వశక్తిపై జీవించేలా సహాయ సహకారాలు అందజేస్తుందని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయం పక్షాన ఫోక్సో అత్యాచార కేసుల్లో ఉన్న ఎంతోమంది బాధితులకు అన్ని రకాలుగా వారి ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని తక్షణ సహాయాన్ని అందిస్తోంది. ఈ నిధి కింద పీజీ చదవడానికి హాస్టల్ ఫీజు కట్టడానికి ఆర్థిక సహాయం చేస్తోంది. పోలీస్ శాఖ అందించే ఈ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని మంచిగా చదివి మంచి మార్కులు సాధించిన విద్యార్థినిలను శుక్రవారం తమ చాంబర్లో జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఫోక్సో అత్యాచారం భరోసా కేంద్రం అండగా నిలుస్తుంది అని అలాగే భరోసా సిబ్బంది బాధితుల యొక్క నివాస ప్రాంతాలను సందర్శించి వారి సాంఘిక ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలను భరోసా బాధిత సహాయ నిధి కింద 5 వేల నుంచి 20 వేల రూపాయల వరకు తక్షణ పరిహారం ఇవ్వడం జరుగుతుందని ఆర్థిక భరోసాతోఉన్నత చదువులు చదివి అన్నిరంగాలలో రాణించి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి ఆర్థికంగా ఎదిగి తమ కాళ్లపై నిలబడగలిగి మహిళ సాధికారతలో భాగం కావాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జ్ అదనపు ఎస్పి ఉమామహేశ్వరరావు, ఏహెచ్ టి యు ఎస్సై అంజద్, భరోసా సెంటర్ కోఆర్డినేటర్ శిరీష, భరోసా సిబ్బంది పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## చిల్డ్రన్స్ హోమ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన సీనియర్ సివిల్ జడ్జి

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** నారాయణపేట పట్టణం లోని బోరం బావి వద్దనున్న చిల్డ్రన్స్ హోమ్ ఓల్డ్ ఏజ్ హోమ్‌లను శుక్రవారం సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్ ఆకస్మాత్తుగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలిం చారు. రోజువారి ఆహార దిన పట్టిక, వసతులను అడిగి తెలుసుకున్నారు. హోమ్‌లో పనిచేస్తున్న సిబ్బందిహాజరు పట్టికను పరిశీలిం చారు. ఆహార ధాన్యాల నాణ్యత, తాగునీరు, పరిశుభ్రత తదితర అంశాలగురించి తెలుసుకు న్నారు. అడ్మిషన్ ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. ప్రతి అంశాన్ని రికార్డులు నమోదు చేయాల న్నారు. ప్రభుత్వంఆదేశాల మేరకు మెనూ ప్రకారం పెడుతున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు ఎప్పటికప్పుడు కూరగాయలు ఫ్రెష్‌గాకొనుగోలు చేయాలనిసిబ్బందికి ఆదేశించారు. టాబ్లెట్స్, సిరాప్‌లు ఎక్స్పైరీ డేట్ పరిశీలించారు. బెడ్‌షీట్స్, గదులు, బాత్రూమ్, వాష్రూమ్స్ ఎప్పటిక ప్పుడు క్లీన్‌గా ఉంచాలని సిబ్బందికి ఆదేశించారు. లైట్స్, ఫాన్స్ పనిచేస్తున్నాయా లేదా అని పరిశీలించారు. ఏలాంటి వస్తువులు తీసుకున్న తగిన బిల్లులు తీసుకొని రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. హోమ్‌లో ఉన్న వారందరినీ మీ సొంత తల్లిదండ్రుల్లాగా ఇంటి లాగా చూసుకో వాలని పని చేసే సిబ్బందికి ఆదేశించారు.

## యువతకు ఉద్యోగ నైపుణ్యం పెంచేందుకు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని మంత్రి, ఎమ్మెల్యేకు వినతి

**గద్వాల, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో చదువుకున్న, చదువుకోని యువతి, యువకులకు ఉద్యోగ నైపుణ్య అవకాశాలు పెంపొందించి ఉపాధి కల్పించాలని కోరుతూ ఇటీవల గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుని కలిసి విన్నవించారు. మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. మంత్రి ఆదేశాల మేరకు శుక్రవారం తెలంగాణ అకాడమిక్ ఫర్ స్కిల్స్ డెవలప్మెంట్ టాస్క్ సీఈఓ శ్రీకాంత్ సిన్హా ప్రతినిధుల బృందం గద్వాల ఎమ్మెల్యే ను కలిశారు. అనంతరం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో పాటు వీరు జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ ని కలిసి వివరించారు. జిల్లా కేంద్రంలో మౌలిక వసతులు కల్పిస్తే ఉద్యోగ నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని హామీ ఇచ్చారు. అయితే త్వరలోనే మౌలిక వసతులు కల్పిస్తామని కలెక్టర్ ఎమ్మెల్యే ,హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయ్, జిల్లా ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ అధ్యక్షుడు బాబు నాయుడు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## వాల్ పోస్టర్ విడుదల

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా మరికల్ పట్టణంలో నేడు, 27 తేదీల్లో జరగబోయే తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర విస్తృత సమావేశాల సందర్భంగా నేడు జరుగు సభకు పెద్ద ఎత్తున కదలని రావాలని కోరుతూ ఉద్మలగిద్ద గ్రామంలో గోడపత్రికను విడుదల చేశారు. ఇట్టి సభకు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తమ్మినేని వీరభద్రం, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్ వెస్లీ, వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బివెంకట్, రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు నాగయ్య, ఆర్.వెంకట్రాములు పాల్గొంటారని తెలిపారు. అనంతరం పలువురు మాట్లాడారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు హన్మంతు, భీంశప్ప, హన్మంతు, శ్రీనివాస్, గోవిందు, నారాయణ, వెంకటప్ప, మగ్బుల్సాబ్ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో మెరిసిన విద్యార్థికి అభినందనలు

**మానవపాడు, ఏప్రిల్25 ప్రభాతవార్త:** ఇటీవల వెలువడిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో నాలుగవ ర్యాంకు సాధించిన రేణుకను ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు అభినందించారు. ఎర్రవల్లి మండలంలోని కారుపాకుల గ్రామానికి చెందిన రేణుక ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చాటింది. ఈ మేరకు శుక్రవారం కర్నూల్ పట్టణంలోని ఎమ్మెల్సీ నివాసంలో విద్యార్థిని రేణుక ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి ఎమ్మెల్యేని కలిశారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనపరిచినరేణుకను ఎమ్మెల్సీ ఎమ్మెల్యే, పుష్పగుచ్ఛం అందజేసి కప్పి శాలువాతో సన్మానించారు.

## ఉత్తమ మార్కులు సాధించిన నవీన్‌కు సన్మానం

**ఇటిక్యాల, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పుటాన్ దొడ్డి గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థి నవీన్ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూపులో ఇటీవల వెలువడిన ఫలితాలలో 470 మార్కులకు గాను 466 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు సాధించారు. శుక్రవారం గ్రామంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్ యాదవ్ ఉత్తమ మార్కులు సాధించిన ఇంటర్ మొదటి సంవత్సరము విద్యార్థి నవీన్‌ను ఘనంగా సత్కరించి విద్యార్థినిచదివించిన తల్లిదండ్రులను కూడా అభినందించారు. ఉన్నత చదువులు చదువుకు నేందుకు ప్రభుత్వం పరంగా ఆదుకుంటామని గిరిజన విద్యార్థి పెద్ద చదువులు చదువుకొని గ్రామానికి, మండలానికి తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యుడు కృష్ణ, సాయికుమార్, ప్రభాకర్, రామన్న, ఆంజనేయులు, మహేష్, నరసింహులు, బాబు తదితరులు పాల్గొన్నారు.

## జానపద నాటకాలు అంటే జనాలకు మక్కువ ఎక్కువ

**ఖిల్లాఘణపురం ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు జానపదాలు అంటే ఎక్కువ ఇష్టమని తాజా మాజీ జిల్లా జడ్పీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి అన్నారు. గురువారం రాత్రి మండల పరిధిలోని సోలిపురామ్ గ్రామంలో చింతల మునిరంగస్వామి నాటక ప్రదర్శన ఈ నెల 23 నుంచి 25 వరకు నిర్వహిస్తున్నారు. చిన్నతనంలో వీధి నాటకాలు ఆడుతుంటే ఊరంతా వెళ్లి ఆ నాటకాలు చూసి ఆనందించే వాళ్ళం అన్నారు. గతంలో జడ్పీ చైర్మన్ గా ఉన్నప్పుడు పలుమార్లు గ్రామానికి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం కోసం ఈ గ్రామానికి రావడం జరిగిందన్నారు. అంతకుముందు గంధం నాగరాజు మాట్లాడుతూ డాక్టర్ అంబేద్కర్ రాజ్యాంగంలోని రైలు రచించిన రాజ్యాంగం ద్వారా ప్రతి మనిషిలో అక్షరదినం పెంపొందించాలని దాని ద్వారా తన జీవితజ్ఞానం పెరగాలని తన జీవితంలో వెలుగులు నింపాలని ఆయన రాజ్యాంగం ద్వారా ఎంతో మందికి తెలిసిందన్నారు మనిషికి చదవలేదు చదువును నేర్చుకుంటే ఎక్కడ తొలగించుకోకుండా చాలా ఉన్నతంగా జీవించవచ్చని గొప్ప మహనీయుల ద్వారా మనం నేర్చుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల నాయకులు నవీన్ రెడ్డి, కొత్తూరు మన్యం ,కొత్తూరు జానయ్య ,ప్లాచాల వెంకటయ్య ,గ్రామ ప్రజలు కళాకారులు పాల్గొన్నారు.

## మలేరియా దినోత్సవం సందర్భంగా ర్యాలీ

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** జాతీయ మలేరియా దినోత్సవం సందర్భంగా దామరగిద్ద ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా. సుదేష్ణ ఆధ్వర్యంలో ఆరోగ్య, ఆశ కార్యకర్తలచే అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ దోమల వలన వచ్చే వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. దోమల వలన తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు సలహాలు ఇచ్చారు. చలితో కూడిన జ్వరం వచ్చిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వెంటనే రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాన్‌కుర్తి ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ డా. హరిచందన, సామాజిక ఆరోగ్య అధికారి నారాయణ, జానకమ్మ పీహెచ్ఎన్, కిష్టమ్మ సూపర్ వైజర్, వెంకట్రాంరెడ్డి ఫార్మసిస్ట్, నర్మదా స్టాఫ్ నర్సింగ్ ఆఫీసర్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# భూ భారతితో భూ సమస్యల పరిష్కారం

■ మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
■ ప్రజావాణిలో 80 దరఖాస్తులు భూ సమస్యలే
■ కలెక్టర్ విజయేంద్ర బోయి
■ మాచన్‌పల్లిలో భూభారతి అవగాహన సదస్సు



మాట్లాడుతున్న మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** భూ భారతి చట్టంతో భూసమస్యలకు పరిష్కారం లభిస్తుందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రభుత్వం ఉన్నది ప్రజల సంక్షేమం కోసమే అని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని మాచన్‌పల్లి గ్రామంలో నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణలో పలు రకాల భూ సమస్యలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయని, ఈ క్రమంలో రానున్న రోజుల్లో అనేక భూసమస్యలకు భూ భారతివలన పరిష్కారం లభించనుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న భూ భారతి చట్టం, భూముల సమస్యలను సత్వర పరిష్కారానికి ఒక మంచి అవకాశమని ఆయన తెలిపారు. ఈ క్రమంలో ఏప్రిల్ 17 నుంచి ఈ చట్టాన్ని పైలెట్ ప్రాజెక్టుగాఅమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ చట్టం ద్వారా,



హాజరైన ప్రజలు, రైతులు

భూ సంబంధిత వివాదాలను త్వరగా పరిష్కరించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. భూ సమస్యలు తలెత్తకుండా, కుటుంబ తగాదాలు లేకుండా భూ భారతి చట్టం రైతుకు అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. గతంలో ఉన్న ధరణి వల్ల అన్నదమ్ముల మధ్యన సైతం చిచ్చుపెట్టి కుటుంబ సమస్యలకు కారణమైందని గుర్తు చేశారు. ధరణి వల్ల చిన్న చిన్న పొరపాట్లకు సైతం ఎందరో రైతులు నష్టపోయారని అన్నారు. ప్రజా సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రజా ప్రభుత్వం తెచ్చిందని, అందులో భాగంగానే గృహజ్యోతి, రైతు రుణమాఫీ రైతు భరోసా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లాంటి ఎన్నో సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందిస్తూ, వారి అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ మండలంలో 900 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయి అని, అవి పూర్తి కాగానే త్వరలో మరికొందరికి ఇందిరమ్మ ఇండ్లు వస్తాయని ఆయన చెప్పారు. ప్రతి సంవత్సరం 3500 ఇందిరమ్మ ఇండ్లు మన నియోజకవర్గానికి వస్తాయని ఆయన గుర్తు చేశారు. జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ గ్రామాల్లో చాలా భూ సమస్యలు ఉన్నాయి. ప్రజావాణిలో 80శాతం భూ సమస్యలు దరఖాస్తులు వస్తున్నట్లు తెలిపారు. భూ రికార్డులో తప్పుల సవరణకు భూ భారతి చట్టం అవకాశం కల్పించిందని, ధరణిలో అవకాశం లేదని అన్నారు. తహశీల్దార్ వద్ద పరిష్కారం కాకుంటే సివిల్ కోర్టులను ఆశ్రయించ వలసి వచ్చేదని అన్నారు. నూతన భూభారతి చట్టంతో తహసిల్దార్ వద్దనే 80 శాతం భూ సమస్యలు పరిష్కారం కానున్నట్లు, తహశీల్దార్ వద్ద పరిష్కారం కాకుంటే అర్‌డి ఓఅర్‌డిఓ వద్ద కాకుంటే కలెక్టర్‌కు, కలెక్టర్ వద్ద కాకుంటే సిసిఎల్ఏ వద్దకు అప్పీల్ వెళ్ళ వచ్చు అని తెలిపారు. వారసత్వంగా వచ్చిన భూములు పేరు మార్పుకు విచారించి 30 రోజుల్లో పరిష్కారం చేయడం జరుగుతుందని, లేనిచో మ్యుటేషన్ అయినట్లే చట్టంలో పేర్కొన్నట్లు తెలిపారు. భూ భారతి చట్టం ద్వారా ఉచిత న్యాయ సహాయం అందించడంజరుగుతుందని తెలిపారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి డిఅర్‌డిఓ నర్సింహులు, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, సిజే బెనహర్, తహసీల్దార్ సుందర్ రాజ్, ఎంపిడిఓ కరుణశ్రీ పాల్గొన్నారు.

# భూ భారతిపై అవగాహన సదస్సు

భూ భారతి చట్టంతో పెండింగ్ భూ సమస్యలకు పరిష్కారం : నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** భూభారతి చట్టంతో ఎన్నో సంవత్సరాలుగా రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ స్పష్టం చేశారు. రైతులు ఈ కొత్త చట్టంలోని సెక్షన్ల పై అవగాహన పెంచుకోవాలని ఆమె సూచించారు. భూ భారతి చట్టంపై రైతులకు అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న అవగాహన సదస్సులలో భాగంగా శుక్రవారం కొడంగల్ నియోజకవర్గం కోస్గి మండల కేంద్రంలోని లక్ష్మినరసింహ ఫంక్షన్ హాల్‌లో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భూ భారతి అవగాహన సదస్సుకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధరణిలో ఉన్న సమస్యలను గుర్తించి ధరణి స్థానంలో రైతులకు మేలైన చట్టం తేవాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ధరణిని రద్దుచేసి రైతు సంఘాలు, రెవెన్యూ అధికారులు, మేధావులతో చర్చలు జరిపి ధరణి స్థానంలో భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందన్నారు. భూ భారతి చట్టం ద్వారా రైతులకు సంబంధించిన అన్ని భూ సమస్యలను పరిష్కరించడమే కాకుండా, వారికి భూధార్ కార్డునుఇవ్వడం జరుగుతుందన్నారు. ధరణిలోఅధికారులకు అధికారాలను తొలగించడం వల్ల భూ సమస్యల పరిష్కారం నిమిత్తం రైతులు సివిల్ కోర్టుకు వెళ్లాల్సి వచ్చేదని, భూ భారతిలో అలాంటి అవసరం లేదని తెలిపారు. కింది స్థాయి అధికారుల వద్ద పొరపాట్లు జరిగితే లేదా పని కాకపోయినా పై స్థాయి అధికారులు న్యాయం చేసే అవకాశం భూ భారతిలో ఉందన్నారు. ధరణిలో రూల్స్ లేవని, కానీ భూ భారతిలో నిర్దిష్టమైన రూల్స్ ఉన్నాయని ఆమె తెలిపారు. అధికారులు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, అలాగే రైతులు సైతం భూ భారతి చట్టం అమలులో



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

అధికారులకు పూర్తి సహకారంఅందించాలని కోరారు. భూముల సర్వేకు రాష్ట్ర ప్రభుత్వం లైసెన్స్ సర్వేయర్లను నియమించనుందని చెప్పారు. ధరణిలో లేని అనేక వెసులుబాట్లు భూ భారతి చట్టంలో ఉన్నాయన్నారు. చట్టంలో మోకాపై ఉన్న రైతులకు హక్కు ఉండాలన్నదే భూ భారతి చట్టం ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. 99 శాతం కేసులు భూ భారతిలో తహసిల్దార్‌వద్దనే ఉచితంగానే పరిష్కారం అవుతాయన్నారు. మ్యుటేషన్లు 30 రోజుల్లో అవుతాయని, ఒకవేళ కాకపోతే పోర్టల్‌లో ఆటోమేటిక్‌గా 31 రోజు అవుతుందని తెలిపారు. కింది స్థాయి నిర్ణయాన్ని పై స్థాయిలో అప్పీల్ అవకాశం భూ భారతిలో ఉందన్నారు. పాత చట్టంలోని లోటు పాట్లు, కొత్తచట్టం లోని వెసులుబాట్ల గురించి కలెక్టర్ క్లుప్తంగా వివరించారు. ఈ సదస్సులో జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వార్ల విజయకుమార్, సింగిల్ విండో అధ్యక్షుడు భీమ్ రెడ్డి, తహసిల్దార్లు బక్క శ్రీనివాస్, భాస్కర స్వామి, ఎంపీడీవో శ్రీధర్, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, కోస్గి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రఘు వర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు సాఫీగా నిర్వహించాలి

■ రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు
■ వీసీలో మంత్రి జూపల్లి కృష్ణారావు

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బంది లేకుండా సాఫీగా ధాన్యం కొనుగోళ్లు నిర్వహించాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రిజూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహశీల్దార్‌లు, మండల వ్యవసాయ అధికారులు, ఏఈఓలు, డిపిఎంలు, ఏపిఎంలు, పిఏసిఎస్ ఇంఛార్జిలతో ఏర్పాటు చేసిన సమావేశంలో సంబంధిత అధికారులతో మంత్రి ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించి పలు సూచనలు చేశారు. కలెక్టరేట్ నుండిజిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావులు పాల్గొన్నారు. మంత్రి జూపల్లి మాట్లాడుతూప్రజా ప్రభుత్వంలో రైతులు కష్టాలు పడకుండా చూసుకోవాలని, వరి కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఇబ్బంది పెట్టడం, మాయిస్టర్ తక్కువ ఉందని ,తాలు పేరుతో వడ్ల నుండి క్వింటాల్‌కు మూడు నుండి ఐదు కేజీలు తరుగు తీయడం చేయవద్దని అధికారులకు స్పష్టం చేశారు రైతులు కొనుగోలు కేంద్రాల వద్దకు ధాన్యాన్ని తీసుకొని వచ్చినా వెంటనేతేమ శాతం, నాణ్యతా ప్రమాణాలు మేరకు ఉన్న ధాన్యం తూకం చేసిన తర్వాత వారికి ఎంత పరిమాణంలో కొనుగోలు చేశారు. ఎంత మేరకు పేమెంట్ చేయాలి రశీదు అందజేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే చెల్లింపులు త్వరగా పూర్తి చేయాలని అన్నారు. రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యాన్ని వాహనాల ద్వారా మిల్లుకు తరలించే వరకు వర్షం వచ్చినా వాటిని కాపాడవలసిన బాధ్యత సెంటర్ వారిదని, గన్ని బ్యాగులు సరిపోవడం లేదని రైతులు ఆందోళన చెందకుండా చూడవలసిన బాధ్యత అధికారులే అనిపేర్కొన్నారు. గన్ని బ్యాగులు అవసరమైన చోట తెప్పించుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో తహసిల్దార్లు, మండలం అగ్రికల్చర్ అధికారులు, ఏఈఓలు, సీసీలు, సెంటర్ ఇన్చార్జులు, పిఏసిఎస్ ఇంఛార్జిలతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గన్ని బ్యాగులు రైతులకు ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు కేంద్రాల వద్దకు ధాన్యం తీసుకురాని రైతులకు ఇవ్వరాదని, రైతులు డైరెక్ట్‌గా వాళ్లంతటవారే మిల్లులకు ధాన్యం తీసుకుని వెళ్లే విధంగా చేయరాదని, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దకు వచ్చిన రైతులకు వారు తెచ్చిన ధాన్యాన్ని పరిశీలించి తేమశాతం, తాలు వంటివి పరిశీలించి అక్కడే తూకం చూసి వాళ్లకి ఒక కొనుగోలు చేసినట్టు రశీదు అక్కడితో ఆ ధాన్యానికి రైతుకు సంబంధం ఉండదని, రైతు ధాన్యం తడుస్తుంది లేదా మిల్లుకు సరైన సమయానికి చేరుకోలేదని వారు బాధపడాల్సిన అవసరం లేదని, ధాన్యం కొనుగోలు కేంద్రం వద్దకు వచ్చిన తర్వాత, రైతు రిసిప్ట్ తీసుకున్న తర్వాత ఆ ధాన్యం మిల్ కు చేరేంతవరకు బాధ్యత సెంటర్ వారిదే అని అన్నారు రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దకు ధాన్యం తీసుకుని రాకుండానే వారికి గన్ని బ్యాగులను అందజేయవద్దని, అలా గన్ని బ్యాగులు అందజేసిన వారి పై శాఖా పరమైన చర్యలు తీసుకోబడతాయని సంబంధిత అధికారులను కలెక్టర్ హెచ్చరించారు. గన్నిలు అవసరమైతే సివిల్ సప్లై అధికారుల్ని సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఓ నరసింహులు, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్, డిసిఓ శంకరాచారి, పౌర సరఫరాల సంస్థ డి.ఎం.రవి నాయక్, సహకార ఆడిట్ అధికారి టైటస్ పాల్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దాడికి ప్రతీకారం పక్కా

◆ అది పిరికిపందల చర్య
◆ ప్రతి భారతీయుడు రక్తం మరుగుతోంది
◆ మూల్యం చెల్లించుకునే రోజులు దగ్గర్లోనే
◆ పాకిస్తాన్ ఉగ్రవాదుల దాడిపై ఎంపీ డీకే అరుణ




మాట్లాడుతున్న మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

**జడ్చర్ల, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** కశ్మీర్ పెహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడి హేయమైనది నీచమైన చర్య అని మహబూ'బ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నిరాయుధులైన పర్యాటకులపై దాడి పిరికిపందల చర్య అని అన్నారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని తేల్చి చెప్పారు. దేశ భద్రతకు విఘాతం కల్పించేందుకే ఇలాంటి కుట్రలు చేయడం ఎంత వరకు సమంజసం కాదన్నారు. 370 యాక్ట్ రద్దు తర్వాత కశ్మీర్‌లో పర్యాటకం మరింత అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. స్విట్జర్లాండ్ తర్వాత అలాంటి పర్యాటక కేంద్రంగా పెహల్గాం ప్రఖ్యాతి, ప్రసిద్ధి పొందిందన్నారు. అలాంటి ప్రకృతి అందాలు చూసేందుకు వచ్చిన పర్యాటకులపై దాడిని ప్రపంచాన్నే కన్నీరు పెట్టించిందనీ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఉగ్రదాడి జరిగిన తీరు దేశంలోని ప్రతి భారతీయుని రక్తం మరిగిస్తోందన్నారు. ఓర్వలేకే కుట్రలు 370యాక్ట్ తర్వాతనే కశ్మీర్‌లో అభివృద్ధిమొదలైందని, పర్యాటకం అభివృద్ధి పొందడంతో అక్కడి యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయనీ, అది చూసి పాకిస్థానీయులు జీర్ణించు కోలేకపోతున్నారనీ మండిపడ్డారు. ఈ దాడికి పక్కా ప్రతికారం తీర్చుకుంటామని తేల్చి చెప్పారు. పాకిస్థాన్ పిరికి పందల్లారా కాసుకోండి, పెహల్గామ్ ఘటనకు పాకిస్థాన్ మూల్యం చెల్లించుకునే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని చెప్పారు. ఉగ్రదాడికి పాల్పడిన ఏ ఒక్కరినీ వదలబోమని ప్రధాని మోడీ చెప్పారని అన్నారు.

## ఇసుక ట్రాక్టర్లు పట్టివేత : కేసు నమోదు

**ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కమాలుద్దీన్ పూర్ గ్రామ శివారులో వాగు నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 18 ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేష్ గౌడ్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం శుక్రవారం మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో తహశీల్దార్ సుగుణ ఆకస్మిక తనిఖీ చేసి అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేస్తున్న ఇసుక లోడుతో ఉన్న 18 ట్రాక్టర్లు ట్రాలీలను గుర్తించి వాటికి సంబంధించిన యజమానులు, డ్రైవర్లు కరుణాకర్, చంద్రయ్య, రమేష్ ,అవినాష్, శ్రీనివాస్ గౌడ్ ,ఆంజనేయులు, రంజిత్ రెడ్డి ,యాదయ్య ,కృష్ణ సాగర్ ,కమలయ్య ,సాయికుమార్ ,మోహన్ ,మధు ,పులేందర్ గౌడ్, అంజిరెడ్డి, నరసింహ, బాలయ్య ,ఆంజనేయులు గౌడ్ ,మల్లేష్ ,రాములు ,వెంకటేష్ గుర్తించి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారని అట్టి ఫిర్యాదు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## రాష్ట్రంలోకి వరి ధాన్యాలు అక్రమ రాకుండా జాగ్రత్త పడాలి

**కృష్ణ, ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** కృష్ణ మండలం, టై రోడ్డు సమీపంలోని చెక్‌పోస్టును శుక్రవారం మండల తాసిల్దారు వెంకటేశ్ తనిఖీలో భాగంగా రిజిస్టర్లను పరిశీలించారు. గతంలో లాగా నిర్లక్ష్యం వహించొద్దని, కర్ణాటక నుంచి అక్రమ వరిధాన్యాలు రాష్ట్రంలోకి రాకుండా అప్రమత్తంగా ఉండాలని, అక్కడి అధికారులకు సూచిస్తూ దిశా నిర్దేశం చేశారు.

## షెడ్రిగేషన్ షెడ్‌ను పరిశీలించిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్

**గండీడ్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** గండీడ్ మండల పరిధిలోని చెన్నాయపల్లి గ్రామంలోని షెడ్రి గేషన్ ను, నర్సరీలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ శుక్రవారం పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ గండీడ్ మండలంలోని చెన్నాయ పల్లి కార్యదర్శి మంగమ్మ ఉద్యోగంలో చేరి నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా (రెగ్యులరైజేషన్) క్రమబద్ధీకరించడానికి వెరిఫికేషన్ కోసం గ్రామపంచాయతీకి రావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో దేవన్న, గ్రామ పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదుల దాడి హేయనీయం

**నారాయణపేట టౌన్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** పహల్గావ్‌లో సామాన్య యాత్రికులపై మూకుమ్మడి ఉగ్రదాడి చేసి అమానవీయంగా ప్రజలను చంపడం హేయమైన చర్య అని, ప్రత్యేకించి హిందువులను లక్ష్యంగా చేసుకుని హిందువులపై దాడి చేసి చంపడం దారుణమైన విషయమని ఇట్టి ఉగ్రవాద దాడులను శక్తి పీఠం తీవ్రంగా ఖండిస్తుందని శక్తిపీఠం వ్యవస్థాపకులు పూజ్యశ్రీ డా.స్వామి శాంతానంద పురోహిత్ అన్నారు. అంతకుముందు శక్తిపీఠం నుండి సెంటర్ చౌక్ వరకు ఉగ్రదాడులను నిరసిస్తూ శాంతియుత నిరసన ర్యాలీని చేపట్టారు. కార్యక్రమ ములో శక్తి పీఠం ట్రస్ట్ సభ్యులు, భజనా మండలి సభ్యులు, మహిళా కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

**గద్వాల, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** కశ్మీర్ లో అమాయక టూరిస్ట్ ల పై ఉగ్ర దాడి జరిపి 25 మందిని అమానుషంగా చంపిన ఉగ్ర వాదులను ఏరి పారేయాలని, వక్ఫ్ పరిరక్షణ కమిటీ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాఅధ్యక్షుడు ముహమ్మద్ నిజాముద్దీన్ కేంద్రానికి డిమాండ్ చేశారు. ఉగ్రవాదుల దాడిలో చనిపోయిన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరారు. ఈ సంఘటన పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ సంఘటన పట్ల విచారం తెలుపుతూ, నల్ల బ్యాడ్జిలు ధరించి గద్వాల రహ్మానియ మస్జిద్ యందు జుమా నమాజ్ అనంతరం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలోసంఘ నాయకులు సయ్యద్ అలిముద్దిన్, మాజీ కౌన్సిలర్ షాకిర్ మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

**అమరచింత, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** జమ్ము కాశ్మీర్ లోని మహల్గంలో జరిగిన ఉగ్రవాద దాడిలో అమరులైన వారికి సిపిఎం పార్టీ కేంద్ర కమిటీ పిలుపుమేరకు శుక్రవారం అమరచింత మున్సిపల్ కేంద్రంలోని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి, జిఎస్ గోపి మాట్లాడుతూ, భారత ప్రజల సమైక్యతను విచ్ఛిన్నం చేయడానికి ఉగ్రవాది సంస్థలు భారత్ ప్రజలపై కాల్పులు జరుపుతున్నారని ఉగ్రవాదులు అమాయక ప్రజలను చంపడం పిరికిపంద చర్య అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు బి.వెంకటేష్, అజయ్, రమేష్, చంటి, రాఘవేంద్ర, బుచ్చన్న, శ్యాంసుందర్, సిజ్ఞానం పాల్గొన్నారు.

## స్నేహితుడి వైద్యానికి ఆర్థిక సాయం

**నవాబుపేట ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** గురువారం చిన్ననాటి స్నేహితుడు తిరుమలాపూర్ గ్రామానికి చెందిన గుడ్ల యాదగిరి ప్రమాదవశాత్తు గాయపడి చేతులు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఇప్పటూర్ మాజీ ఉపసర్పంచ్‌దుబ్బ రవికిరణ్ ఆధ్వర్యంలో స్నేహితులు ఇప్పటూర్ పదవ తరగతి 1999, 2000 సంవత్సరం బ్యాచ్ సహ స్నేహితులు అందరూ కలిసి మెరుగైన వైద్య నిమిత్తం హాస్పిటల్ ఖర్చులకోసం రూ.20 వేల సహాయం చేయడం జరిగింది. టెన్త్ క్లాస్‌బ్యాచ్ మండల పరిధిలోని ఇప్పటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అతనితో పాటు కలిసి ఉన్నత పాఠశాల 2019, 2020 బ్యాచ్ సంవత్సరం పదవ తరగతి పూర్తి చేసిన మిత్రులు గుడ్ల యాదగిరికి భవిష్యత్తులోనూ తమ మిత్రునికి కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. మురళి, నరసింహ, రాఘవేందర్, వెంకటేష్, యాదయ్య, శ్రీను, చంద్రశేఖర్, బాలు, లాల్‌సింగ్ అందజేశారు.